ప్రజాశక్తి

మంగళవారం 10 అక్టోబర్ 2023 8 పేజీలు



ఎన్‌టిఆర్



కృష్ణా



షేర్ మహమ్మద్‌పేటలో విద్యార్థుల మానవహారం

'గ్రీన్‌టెక్'ను తరలించండి

- సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డివి.కృష్ణ
- షేర్ మహమ్మద్‌పేట నుండి నందిగామ వరకు బైక్ ర్యాలీ
- ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ధర్నా, వినతిపత్రం సమర్పణ

ప్రజాశక్తి - జగ్గయ్యపేట, నందిగామ : జగ్గయ్యపేట పరిసర ప్రాంతాల్లో కాలుష్యం వెదజల్లుతున్న ఫ్యాక్టరీలను అక్కడి నుండి తరలించాలని సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డివి కష్ణ పిలుపునిచ్చారు. ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం షేర్ మహమ్మద్ పేట గ్రామ సమీపంలోని గ్రీన్‌టెక్ ఫ్యాక్టరీని తరలించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం బైక్ యాత్ర నిర్వహించారు. ఈ బైక్ యాత్ర షేర్ మహమ్మద్ పేట, రామచంద్రుని పేట, అనుమంచి పల్లి, జగ్గయ్యపేట, చిల్లకల్లు మీదుగా నందిగామలోని ఆర్‌డిఒ కార్యాలయం వరకు సాగింది. అనంతరం ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సమస్యపై స్పందన కార్యక్రమంలో ఆర్‌డిఒ రవీంద్రరావుకు నేతలు వినతిపత్రం అందజేశారు. ఈబైక్

(మిగతా 6లో)



ఆర్‌డిఒకు వినతిపత్రం అందిస్తున్న డివి.కృష్ణ, ఎన్.సిహెచ్.శ్రీనివాస్, నాగమణి, హనుమంతరావు తదితరులు

ఆక్వా జోన్‌పై కసరత్తు పూర్తి?

- 16 మండలాల్లో 75,851 ఎకరాలు
- జోన్‌కు దూరంగా 9 మండలాలు

ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి

నూతనంగా ఆక్వా జోన్ల ఏర్పాటుకు కసరత్తు పూర్తి కావచ్చింది. కృష్ణాజిల్లాలోని 16 మండలాల్లో 75,851 ఎకరాల విస్తీర్ణం ఆక్వా జోన్ పరిధిలోకి తీసుకోవడానికి ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. గతంలో పేదలకు ఎసైన్డ్ అయిన ఇతరుల ఆధీనంలో ఉన్న భూములు, ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూములకు సంబంధించి మొత్తం 25,600 ఎకరాలు జోన్ పరిధిలో చేర్చాలా? లేదా? అన్న దానిపై స్పష్టత రావాల్సి ఉంది. రెండు పంటలు పండే సారవంతమైన వ్యవసాయ భూముల మధ్యలో ఉన్న చెరువులు, ఆసలు ఆక్వా చెరువుల్లేని తొమ్మిది మండలాలను ఆక్వా జోన్ల పరిధి నుంచి మినహాయించారు.

వ్యవసాయ పంటల సాగు ద్వారా వచ్చే ఆదాయం తగ్గిపోవడంతో ప్రత్యామ్నాయంగా ఆక్వా సాగు విస్తరించింది. ఒకింత లాభసాటిగా ఉండటంతో బడాబాబులు రంగప్రవేశం చేశారు. వ్యవసాయ భూములు వేల ఎకరాలను లీజులకు తీసుకుని చెరువులు తవ్వారు. ప్రభుత్వ భూములకు సంబంధించి సముద్ర తీర బంజర్లు, ఉప్పు పండే భూములు, డ్రయిన్ పోరంబోకులు, పేదలకు ఎస్సైన్డ్ చేయబడిన భూములను ఆక్రమించి చెరువులుగా మార్చేశారు. 22 మండలాల్లోని 1,11,451 ఎకరాల చెరువుల్లో చేపలు, రొయ్యలు సాగవుతున్నాయి. వ్యవసాయ భూములు ఆక్వా చెరువులుగా మారిపోవడంతో క్రమేణా వ్యవసాయ పంటల సాగు తగ్గిపోతోంది. ఈ క్రమంలోనే మత్స్యశాఖ ఆక్వా జోన్లను నిర్ధారించేందుకు పూనుకుంది.

జోన్ పరిధిలో ఉంటేనే విద్యుత్ రాయితీ

ఆక్వా జోన్లను నిర్ధారించడానికి 2018లోనే అప్పటి ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. 40,326 ఎకరాలను జోన్ పరిధిలో చేర్చింది. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది తర్వాత జోన్‌కు వెలుపల ఉన్న చెరువుల వద్ద ఉపయోగించే మోటార్లకు విద్యుత్ రాయితీని నిలిపివేసింది. దీంతో ఆయా ప్రాంతాల్లో రైతులు ఆందోళనకు దిగారు. ప్రజాప్రతినిధులపై ఒత్తిడి తీసుకువచ్చారు. దీంతో 2023లో తిరిగి జోన్ల నిర్ధారణకు ప్రభుత్వం పూనుకుంది. తాజాగా మరో 35,525 ఎకరాలను జోన్ పరిధిలోకి తీసుకువచ్చారు. రెండుసార్లు నిర్వహించిన సర్వేలో మొత్తం 75,851 ఎకరాల వరకు జోన్ పరిధిలోకి వచ్చాయి. ఈ జోన్ పరిధిలోని చెరువులకు ఉన్న విద్యుత్ కనెక్షన్లకు మాత్రమే ప్రభుత్వం విద్యుత్ రాయితీ అందిస్తుంది.

ఆక్వా జోన్‌కు తొమ్మిది మండలాలు దూరం

కృష్ణాజిల్లాలో మొత్తం 25 మండలాలకుగాను 22 మండలాల్లో ఆక్వా చెరువులున్నాయి. అయితే 16 మండలాల్లోని చెరువులను మాత్రమే ఆక్వా జోన్‌లోకి తీసుకున్నారు. కంకిపాడు, పెనమలూరు, పమిడిముక్కల మండలాల్లో ఆక్వా సాగు లేదు. ఉంగుటూరు, తోట్లవల్లూరు, గూడూరు, మొవ్వ, గన్నవరం, బాపులపాడు మండలాల్లో రెండు పంటలు పండే సారవంతమైన భూముల మధ్యలో చెరువులు తవ్వినట్లు గుర్తించారు. అయినా ఈ మండలాలను ఆక్వా జోన్ నుంచి మినహాయించారు.



ఆక్వా జోన్ పరిధిలో 16 మండలాలు

ఎన్.శ్రీనివాసరావు, మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్, కృష్ణా

ఆక్వా జోన్ నిర్ధారణలో ప్రభుత్వ మార్గదర్శకాలను పాటించాం. చేపలు, రొయ్యల చెరువులు ఎక్కువ విస్తీర్ణంలో ఉన్న మండలాలను ఆక్వా జోన్ పరిధిలోకి తీసుకువచ్చాం. రెండు పంటలు పండే సారవంతమైన భూములున్న మండలాలను, సారవంతమైన భూముల మధ్యలో తవ్విన చెరువులను ఆక్వా జోన్ నుంచి మినహాయించాం.

వేగంగా బైపాస్ పనులు

- వచ్చే వేసవికి ప్యాకేజి 3 పనులు పూర్తయ్యే అవకాశం
- రూ.1,148 కోట్లతో నిర్మాణం

ప్రజాశక్తి - గన్నవరం : విజయవాడ నగరంలో రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ కష్టాలను పరిష్కరించేందుకు చేపట్టిన 16వ నంబర్ జాతీయ రహదారి బైపాస్ రోడ్డు నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. భారతమాల ప్రాజెక్ట్‌లో భాగంగా చిన అవుటపల్లి నుంచి గుంటూరు జిల్లా చినకాకాని వరకు 48 కిలోమీటర్ల పొడవునా రెండు ప్యాకేజీలుగా ఆరు లైన్ల గ్రీన్‌ఫీల్డ్ రహదారిని నిర్మిస్తున్నారు. ప్యాకేజీ 3లో భాగంగా చినఅవుటపల్లి నుంచి గొల్లపూడి వరకు 30 కిలోమీటర్ల బైపాస్ రోడ్డు నిర్మాణం చేపట్టిన మెగా ఇంజినీరింగ్ సంస్థ ఇప్పటికే 80 శాతం పనులను పూర్తిచేసింది. మరో మూడు నెలల్లో రహదారి నిర్మాణాన్ని పూర్తిచేసి జాతికి అంకితం చేసే దిశగా పనుల్లో వేగం పెంచింది. ప్యాకేజీ 4లో భాగంగా చేపట్టిన గొల్లపూడి నుంచి చినకాకాని వరకు 18 కిలోమీటర్ల బైపాస్ పనులు కూడా పూర్తయితే విజయవాడపై ట్రాఫిక్ భారం తగ్గుతుంది. ఏలూరు వైపు నుంచి హైదరాబాద్, గుంటూరు వైపు రాకపోకలు సాగించే వాహనాలు గొల్లపూడి మీదుగా బైపాస్ రోడ్డులో వెళ్లనున్నాయి.

రూ.1,148 కోట్లతో బైపాస్ నిర్మాణం

ప్యాకేజీ 3లో భాగంగా రూ.1,148 కోట్లతో చేపట్టిన ఈ బైపాస్ రోడ్డు చిన అవుటపల్లిలోని పిన్నమనేని సిద్ధార్థ వైద్య కళాశాల సమీపంలో జీరో పాయింట్ నుంచి ప్రారంభమై గొల్లపూడిలో 30వ కిలోమీటర్ వద్ద ముగుస్తుంది. ఈమార్గంలో రెండు రైల్వే ఫ్లైఓవర్లు మినహా 36 మైనర్ వంతెనలు, 17 వెహికల్ అండర్ పాస్‌లు, రెండు బాక్స్ కల్వర్ట్‌లు, మరో 44 పైపు కల్వర్టులు, గ్రామాల వద్ద సర్వీస్ రోడ్ల నిర్మాణం దాదాపుగా పూర్తయ్యాయి. మర్లపాలెం, గొల్లపూడి వద్ద రైల్వేట్రాక్‌లకు ఇరువైపులా పిల్లర్ల నిర్మాణం పూర్తిచేసి ఫ్లైఓవర్ కోసం గడ్డర్లు ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. చిన అవుటపల్లి వద్ద నిర్మాణంలో ఉన్న రహదారి మర్లపాలెం నుంచి అంబాపురం వరకు ఆరులైన్ల పనులు పూర్తికాగా, చినఅవుటపల్లి, మర్లపాలెం, బిబి గూడెం వద్ద వంతెనలు, అండర్ పాస్‌లకు రహదారిని అనుసంధానించే పనులు వేగంగా జరుగుతున్నాయి. సూరంపల్లి - నున్న మధ్యలో టోల్‌ప్లాజా నిర్మాణం కూడా జరుగుతోంది. వాహనదారుల సౌకర్యార్థం పలుచోట్ల బైపాస్ రోడ్లకు ఇరువైపులా టాయిలెట్లను నిర్మిస్తున్నారు. నున్న వద్ద హైటెన్షన్ వైర్లు ఎత్తు పెంచకపోవడంతో నిర్మాణ పనులకు కొంత ఆటంకంగా మారింది. ఈ అవరోధాలను అధిగమించేందుకు ఎన్‌హెచ్‌ఎ అధికారులు, జిల్లా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. మిగిలిన నిర్మాణ పనులను కూడా మార్చిలోపు పూర్తిచేసే దిశగా మెగా ఇంజినీరింగ్ సంస్థ, నేషనల్ హైవే అథారిటీ అధికారులు సమన్వయంతో ముందుకు వెళ్తున్నారు. వర్షాల కారణంగా రహదారి నిర్మాణ పనులకు కొంత ఇబ్బంది కలిగింది. వర్షాలు తగ్గిన తర్వాత పనుల్లో వేగం పెంచారు. వచ్చే వేసవికాలం నాటికి రహదారి నిర్మాణ పనులు పూర్తిచేసి ప్రజలకు అంకితం చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈరహదారి అందుబాటులోకి వస్తే విజయవాడలో ట్రాఫిక్ సమస్య కొంతవరకు పరిష్కారం అవుతుంది. అలాగే రామవరప్పాడు నుంచి గన్నవరం వరకు కూడా ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం లభిస్తుందని అధికారులు చెబుతున్నారు.

రోడ్డు, వంతెనల నిర్మాణ పనులు



నేడు, రేపు దసరా సాంస్కృతికోత్సవాలు


ప్రజాశక్తి - విజయవాడ : దసరా పండుగ నేపథ్యంలో ఈనెల 10, 11 తేదీల్లో విజయవాడలో సాంస్కతిక ఉత్సవాలు నిర్వహించనున్నారు. దసరా సాంస్కృతిక ఉత్సవాల నిర్వహణ కమిటీ ఆధ్వర్యాన జరిగే ఈ ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం 10 గంటలకు ఘంటసాల సంగీత, నత్య కళాశాలలో బతుకమ్మ, కోలాటం, జడ కోలాటం, జానపద నత్యాలు, క్లాసికల్ పోటీలు జరుగుతాయి. 11వ తేదీ మధ్యాహ్నం 2 గంటల నుండి ఎంబి విజ్ఞాన కేంద్రం చుక్కపల్లి ఆడిటోరియంలో శాస్త్రీయ నత్యాలు (డాన్స్ అకాడమీలు) దాండియా, లఘునాటికలు, అభ్యుదయ గీతాలు తదితర కళారూపాల ప్రదర్శనలు ఉంటాయి. కనకదుర్గమ్మ దుష్టశిక్షణ శిష్ట రక్షణ కోసం చేసిన నవదుర్గాల అవతారాలను ప్రస్తుతం మహిళలు వివిధ రూపాల్లో ఎదుర్కొంటున్న సమస్యలపై కళారూపాలతో వినూత్నంగా ప్రదర్శించనున్నారు.

మంచి పేరెంటింగ్ ముఖ్యం

ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవంలో సబ్ కలెక్టర్

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్శిటీ : తల్లిదండ్రులు తమ పిల్లలకు చిన్నప్పటి నుండే మంచి ప్రవర్తన, సర్దుకుపోయే స్వభావం, అలవాట్లు, క్రమశిక్షణ అలవాటు చేయాలని విజయవాడ సబ్ కలెక్టర్ అతిది సింగ్ అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఇండ్లాస్ హాస్పటల్స్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని ఐఎంఎ హాల్‌లో వైద్య సదస్సు జరిగింది. ఈసందర్భంగా సబ్ కలెక్టర్ అతిది సింగ్ ప్రత్యేక పోస్టర్‌ను ఆవిష్కరించారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలని అందుకు క్రమశిక్షణతో పాటు చక్కటి ఆహారం, వ్యాయామం అవసరమని అన్నారు. ముఖ్యంగా పిల్లలకు చిన్నప్పటి నుండే మంచి మాటలు

(మిగతా 6లో)



సబ్ కలెక్టర్ అతిది సింగ్‌ను సత్కరిస్తున్న డాక్టర్లు ఇండ్ల రామసుబ్బారెడ్డి, రెహమాన్, దుర్గారాణి, నవీన్

ప్రమాదాల నివారణకు కృషి

ప్రజాశక్తి - విజయవాడ : జిల్లాలో రోడ్డు భద్రతా చర్యలతో పాటు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని నూతనంగా పదవి బాధ్యతలు చేపట్టిన రీజినల్ జాయింట్ ట్రాన్స్ పోర్ట్ కమిషనర్ ఎన్.శివరామ ప్రసాద్‌ను కలెక్టర్ ఢిల్లీరావు కోరారు. రవాణా శాఖలో రీజినల్ జాయింట్ ట్రాన్స్పోర్ట్ కమీషనర్‌గా పదవి బాధ్యతలు చేపట్టిన ఎన్.శివరామ ప్రసాద్ సోమవారం నగరంలోని జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఢిల్లీరావును మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రోడ్డు భద్రత, ప్రమాదాల నివారణపై ఎప్పటికప్పుడు సమీక్షా సమావేశాలు నిర్వహించి తగు చర్యలు తీసుకునేందుకు జాయింట్ యాక్షన్ కమిటీలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. 1990 లో సహాయ మోటార్ వాహన తనిఖీ అధికారిగా చిత్తూరు జిల్లాలో ఉద్యోగం లో చేరిన శివరామ ప్రసాద్ 1998లో మోటర్ వాహన తనిఖీ అధికారిగా పదోన్నతి పొంది తిరుపతిలో పనిచేసి 2005లో ఆర్టీవోగా రవాణాశాఖ కమీషనర్ కార్యాలయంలో సేవలందించి అనంతరం కర్నూల్, శ్రీకాకుళం జిల్లాల డిటిసిగా బాధ్యతలు నిర్వహించిన ఆయనకు ప్రభుత్వం రీజినల్ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమీషనర్ విజయవాడ పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో సోమవారం నుండి ఆర్‌జెసిగా విధుల్లో చేరారు.

బాలలకు రక్షణగా నిలుద్దాం

ప్రజాశక్తి-విజయవాడ : నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో వాంబే కాలనీ 60వ వర్డ్ లోని శానిటరీ వర్కర్స్ ఆఫీస్ లోని పారిశుధ్య కార్మికులకు "బాలల పరిరక్షణ" పై అవగాహనా కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా నవజీవన్ బాల భవన్ జోనల్ కోఆర్డినేటర్ యం డి వసంత కుమారి మాట్లాడుతూ బాలల పరిరక్షణ మన అందరి బాధ్యత అని, ఆపదలో ఉన్న బాలలను పరిరక్షించుదామని అన్నారు. బాలలకు రక్షణ గా ఉందాం అని పేర్కొన్నారు. బాలలు అంటే 18 సంత్సరాల లోపు వయస్సు కలిగినవారు అందరూ బాలలే అని, వారి అభిప్రాయాలను గౌరవించాలని, వారి మాటలకు విలువని ఇవ్వాలి అని, బాలలను కొట్టడం, తిట్టడం మానసికంగా వేధించటం వలన వారు మానసికంగా కుంగుబాటుకు గురిఅవుతారు అని, వారి జీవితం పై తీవ్ర ప్రతికూల ప్రభావాన్ని చూపిస్తుందని అన్నారు. ఈ కార్యక్ర మంలో శానిటరీ ఇన్స్పెక్టర్ యం జయపాల్, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు,

అన్ని రంగాల్లో రాణించాలి

ప్రజాశక్తి - మైలవరం : మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని ప్రభుత్వం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి పేర్కొన్నారు. స్థానిక లక్కిరెడ్డి అనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం భౌతిక శాస్త్రం విభాగం ఆధ్వర్యంలో వరల్డ్ స్పేస్ వీక్ వారోత్సవాల్లో భాగంగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతరిక్ష పరిశోధనల్లో భౌతిక శాస్త్రానికి అధిక ప్రాధాన్యత ఉందన్నారు. ఈ ప్రదర్శనలో విశ్వ రహస్యాలను విద్యార్థులు ప్రదర్శించారు.విజేతలకు బహుమతులు అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం ఎదురుగా విజయవాడ జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తికి కాలు నుజ్జు కాగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్ఐ సతీష్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని రోలుపడి గ్రామానికి చెందిన యువకుడు సునీల్ జాతీయ రహదారిపై నడుచుకుంటూ వెళుతుండగా విజయవాడ వైపు నుండి వస్తున్న మరో యువకుడు బైక్‌తో డికొట్టాడు. దీనితో ఇద్దరు రోడ్డుపై పడగా అదే సమయంలో తిరువూరు వస్తున్న బస్సు వారిపై ఎక్కింది. ఈ ప్రమాదంలో సునీల్ కాలు నుజ్జు నుజ్జు కాగా బైకిస్టుకు తీవ్ర గాయాలయ్యాయి. ఇరువురిని 108లో ప్రభుత్వాస్పత్రికి తరలించగా మెరుగైన చికిత్స కోసం వైద్యులు విజయవాడ తరలించారు.

డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : పశ్చిమ నియోజక వర్గంలోని 45వ డివిజన్‌లో డ్రైనేజీ వ్యవస్థ అస్త వ్యస్థంగా ఉండటం తో స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని. దీన్ని పట్టించుకున్న నాథుడు లేడని జనసేన నగర అధ్యక్షులు, పశ్చిమ ఇన్‌చార్జి పోతిన వెంకట మహేష్ తెలిపారు. ఇంటింటికీ రాబోయే జనసేన ప్రభుత్వం రెండో విడతలో భాగంగా 52వ రోజు 45వ డివిజన్ జనసేన అధ్యక్షుడు బొమ్ము రాంబాబు ఆధ్వర్యంలో డివిజన్‌లోని సొరంగం వద్ద, గేదెల రాజు ఇంటి ఎదురు సందు వద్ద నుండి ప్రారంభించి రామకోటయ్య వారి వీధి, కొండపై ప్రాంతాల్లో మహేష్ సోమవారం పర్యటించారు.

మాకు న్యాయం చేయండి : కలెక్టర్‌కు వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : ఎట్కిన్సన్ సీనియర్ సెకండరీ స్కూల్లో విధులు నిర్వహిస్తున్న తమకు ప్రభుత్వ ఉత్తర్వులకు అనుగుణంగానే జీతభత్యాలు చెల్లిస్తామని భరోసా ఇచ్చి, అక్కడే శాశ్వతంగా పని చేయాలి అన్న నిబంధనతో తమను ఎటువంటి పోటీ పరీక్షలకు అనుమతించకుండా ఒరిజినల్ సర్టిఫికేట్స్ అన్నీ వారి వద్దనే ఉంచుకుని యాజమాన్యం ఇబ్బందులకు గురి చేస్తుందని పలువురు ఉపాధ్యాయులు సోమవారం ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావుకు స్పందనలో ఫిర్యాదు చేశారు. మేనేజ్మెంట్ పాఠశాల 1899లో సెయింట్ ఆన్స ఆఫ్ ప్రొవిడెన్స్ అనే రిజిస్టర్డ్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రారంభించారని, 2009 వరకు ఆంగ్లో ఇండియన్ బోర్డుకు అనుబంధంగా ఉండి సిబిఎస్ఇ బోర్డుకు అనుబంధ పాఠశాలగా మారిందని. సుమారు 4000 మంది విద్యార్థుల నుండి ఫీజుల రూపంలో రూ.14,06,44,800లు సేకరణలో, ఇతరత్రా బిల్డింగ్ ఫండ్ అనే పేరుతో డొనేషన్స్ సేకరణతో, కోట్లలో రిజర్వ్ ఫంట్ కలిగి ఉందన్నారు. అయితే ప్రస్తుత యాజమాన్యం, ఉద్యోగుల జీతాల చెల్లింపులో మాత్రం ఎంతో నిర్లక్ష్యంగా ఉదాసీనంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. ప్రస్తుతం ఉన్న నూతన యాజమాన్యం కమిటీ అనే పేరుతో సీబీఎస్ఈ అఫిలియేషన్ సందర్భంలో ప్రభుత్వం తరపున డి.ఇ.ఓకి ఆధారాలతో సమర్పించి, ఆమోదింపచేసిన అపెండిక్స్–3ను పూర్తిగా ఉల్లంఘిస్తోందన్నారు. ఆయా సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ దష్టికి తీసుకువెళ్ళగా ఆయన స్పందించి డి.ఇ.ఓ. ఈ విషయంపై సమగ్ర పరిశీలన చేసి త్వరితగతిన శాశ్వత ప్రాతిపదికన వారికి న్యాయం జరిగే విధంగా చేయాలని సూచించారు.

జగన్ పాలనలో సర్వతోముఖాభివృద్ధి: వైసిపి

ప్రజాశక్తి - వన్‌టౌన్ : సిఎం జగనన్న పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో సర్వతో ముఖాభివృద్ధి సాధిస్తోందని వైసిపి రాష్ట్ర నాయకులు ఆకుల శ్రీనివాస్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని ఇందిరా గాంధీ స్టేడియంలో జరిగిన వైసిపి దశ నిర్దేశా కార్యక్రమంలో సిఎం జగన్ పార్టీ శ్రేణులకు చక్కటి మార్గదర్శనం చేశారని కొనియాడారు. రాష్ట్రంలో కొత్తగా 17 మెడికల్ కాలేజీలు తీసుకు వచ్చిన ఘనత జగన్ మోహన్ రెడ్డికే దక్కుతుందని పేర్కొన్నారు. వ్యవసాయ రంగం గత టిడిపి ప్రభుత్వంలో – 6.5 శాతం నుండి రైతు పక్షపాతి వైఎస్ జగన్ ముఖ్యమంత్రి పదవి చేపట్టిన తరువాత 8.2 శాతానికి పెంచిన ఘనత జగనన్న ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లాలోని ఎమ్మెల్యేలు సామినేని ఉదయభాను, మొండితోక అరుణ్ కుమార్, నూజివీడు ఎమ్మెల్యే మేక ప్రతాప్ అప్పారావులతో కలిసి తాను స్వయంగా పాల్గొనడం జరిగిందనీ ఆకుల శ్రీనివాస్ పేర్కొన్నారు.

'జాబ్ నో మోర్ ఏ డ్రీమ్'పై సదస్సు



సెమినార్‌లో మాట్లాడుతున్న పబ్బా రమేష్

ప్రజాశక్తి - వన్‌టౌన్ : కొత్తపేటలోని పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (స్వయం ప్రతిపత్తి) కళాశాల ఈఈఈ విభాగం ఐఈఈఈ, ఐఈఐ స్టూడెంట్ చాప్టర్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం కళాశాలలో 'పి.ఎస్.యూ. జాబ్ నో మోర్ ఏ డ్రీమ్' అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎసిఇ ఇంజనీరింగ్ అకాడమీ సీనియర్ ఫ్యాకల్టీ పబ్బా రమేష్ పాల్గొని మాట్లాడుతూ ఈ వేగవంతమైన ప్రపంచంలో ప్రతి ఒక్కరూ విజయం వెనుక నడుస్తున్నారని తెలిపారు. ప్రతి విద్యార్థి డైనమిక్ కెరీర్‌ను నిర్మించుకోవాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఆ ప్రయోజనం కోసం పోటీ పరీక్షలు అత్యంత ఆకర్షణీయమైన మార్గాల్లో ఒకటన్నారు. ఈఈఈ విభాగానికున్న ఉద్యోగ అవకాశాలు గురించి, గేట్ ఎగ్జామ్ ఆవశ్యకత గురించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ వడుచూరి లక్ష్మణస్వామి, ప్రిన్సిపాల్ డాక్టర్ జె.లక్ష్మీనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.పతంజలి శాస్త్రి, ఈఈఈ విభాగాధిపతి ప్రొ.ఎ శేఖర్ సునీల్, ఈఈఈ విభాగ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దుర్గమ్మను దర్శించుకున్న మంత్రి ఉషశ్రీ

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రి దుర్గమ్మను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కె.వి.ఉషశ్రీ చరణ్ సోమవారం శ్రీ అమ్మవారి దర్శనార్థం ఆలయానికి విచ్చేశారు. ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి శ్రీ అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం వేదపండితులు వేదాశీర్వచనం చేయగా ఆలయ అధికారులు శ్రీ అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.

ధర్నాను జయప్రదం చేయాలి



కరపత్రాలు పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న భవన నిర్మాణ కార్మికులు

ప్రజాశక్తి - వీరులపాడు : జుజ్జూరు గ్రామంలో భవన నిర్మాణ కార్మికుల సమస్య పరిష్కారం చేయాలని, విజయవాడలో 10న జరిగే ధర్నా జయప్రదం చేయాలని సోమవారం ఉదయం వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులతో సిఐటియు మండల కార్యదర్శి లాల్ మహ్మద్ కరపత్రాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. భవన నిర్మాణ కార్మిక రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ నిధులను దారిమళ్లించి కార్మికులకు రావాల్సిన సంక్షేమ పథకాలు పూర్తిగా రద్దుచేసి భవన నిర్మాణ కార్మికులకు అన్యాయం చేసిందని సమస్య పరిష్కారం కోసం పోరాటలే మార్గాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మీరా హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు విడుదల కోరుతూ దీక్షలు

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: పట్టణంలో 31 రోజులుగా జరుగుతున్న దీక్ష శిబిరం మాజీ శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ ఆధ్వర్యంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కట్టా వెంకట నరసింహారావు అధ్యక్షతన కొనసాగుతోంది. దీక్షలో పెనుగంచిప్రోలు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చింతల సీతారామయ్య ఆధ్వర్యంలో అనిగండ్లపాడు గ్రామ తెదేపా మహిళా నేతలు మరియు తెదేపా నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున దీక్ష చేపట్టారు. **నందిగామ :** నారా చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టును ఖండిస్తూ, మాజీ శాసనసభ్యులు తంగిరాల సౌమ్య ఆధ్వర్యంలో కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలలో భాగంగా 27వ రోజు కొనసాగుతున్నాయి. **గంపలగూడెం:** చంద్రబాబు అరెస్టు జైలుకు వెళ్లి నేపథ్యంలో మద్దతుగా అప్పటినుండి నేటి వరకు విరామం లేకుండా ఆ పార్టీ శ్రేణులు నిరాహార దీక్షలు, నిరసనలు చేపడుతున్నారు. అందులో భాగంగా జిల్లా తెలుగు రైతు అధ్యక్షుడు చెరుకూరు రాజేశ్వర ఆధ్వర్యంలో ఊటుకూరు గ్రామంలో రిలే దీక్ష జరిగింది. ఈ కార్యక్రమంలో తిరువూరు ఇంచార్జ్ సిహెచ్ దత్తు, పార్టీ మండల అధ్యక్షుడు రేగళ్ల వీరారెడ్డిలు మాట్లాడారు. వివిధ గ్రామాల నుండి దీక్షలో మహిళల సైతం పాల్గొన్నారు మండల తెలుగు యువత అధ్యక్షుడు మానుకొండ రామకష్ణ, సీనియర్ నాయకులు పుల్లయ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు. **వన్‌టౌన్ :** 26వ రోజు సోమవారం రిలే నిరాహారదీక్ష పశ్చిమ నియోజకవర్గం కార్యాలయంలో టీం టిడిపి ఆధ్వర్యంలో జరిగింది.

నగరనాడు గౌరవాధ్యక్షులుగా కెఎస్ జగన్

ప్రజాశక్తి - వన్‌టౌన్ : నగరనాడు రాష్ట్ర గౌరవాధ్యక్షులుగా కెఎస్ జగన్‌ని నగరనాడు రాష్ట్ర అధ్యక్షులు పోతిన వరప్రకాష్ సోమవారం నియమించారు. ఈ సందర్భంగా పోతిన వరప్రకాష్ మాట్లాడుతూ నగరాల సామాజిక వర్గానికి ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తూ సహాయ సహకారాలు అందిస్తూ నగరంలోని ప్రముఖులుగా నిలిచిన జగన్‌ని నగరనాడు గౌరవ అధ్యక్షులుగా నియమించామన్నారు. ఇటీవల సిఎం జగన్‌ను కలిసి నగరాల కులస్తులకు న్యాయం చేయాలని కోరినట్లు తెలిపారు. అసెంబ్లీలో స్థానిక శాసనసభ్యులు వెలంపల్లి శ్రీనివాస్ నాలుగు జిల్లాలకే పరిమితమైన బీసీల గుర్తింపును రాష్ట్రవ్యాప్తం చేయాలని అభ్యర్థించినట్లు తెలిపారు. ఈ విషయమై త్వరితగతిన అమలు చేయాలని సిఎం జగన్మోహనరెడ్డిని పోతినవరప్రకాష్ అభ్యర్థించారు. శ్రీశైలంలో నగరాల వసతిసత్రం కోసం పశ్చిమ ఎమ్మెల్యే శ్రీనన్న సహకారం ఎనలేనిదని కొనియాడారు.



పనులకు శంకుస్థాపన చేస్తున్న ఆదిలక్ష్మి

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - వన్‌టౌన్ : స్థానిక 48వ డివిజన్ అభివద్ధి కార్యక్రమంలో భాగంగా వెంకటయ్య కొట్టు కొండ ప్రాంతం బ్రహ్మంగారి మఠం ఏరియాలో సుమారుగా రూ.5 లక్షల వ్యయంతో స్థానిక 48వ డివిజన్ కార్పొరేటర్ అత్తులూరి ఆదిలక్ష్మి పూజా కార్యక్రమం నిర్వహించి, పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆదిలక్ష్మి మాట్లాడుతూ డివిజన్ సమగ్రాభివృద్ధి తమ ధ్యేయమని అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ఇన్‌ఛార్జ్ అత్తులూరి పెద్దబాబు, డివిజన్ ప్రెసిడెంట్ పిళ్లా సూరిబాబు జగ్గు, సచివాలయం కన్వీనర్లు అయిత కష్ణ కిషోర్, తొత్తడి వరలక్ష్మి పశ్చిమ నియోజకవర్గం సోషల్ మీడియా కో కన్వీనర్ దుక్క హరి భాస్కర్ స్థానిక నాయకులు బాయన అమర్ నాథ్ కాంట్రాక్టర్, సచివాలయం ఇంజనీరింగ్ సెక్రెటరీ సాయి, స్థానికులు పాల్గొన్నారు.

రోజాపై మండిపడ్డ తెలుగు మహిళలు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : మంత్రి రోజా తన నోరు అదుపులో పెట్టుకోవాలని తెలుగు మహిళ పశ్చిమ అధ్యక్షురాలు సుకాశి సరిత మండిపడ్డారు. సోమవారం రోజా చిత్రపటాన్ని పశ్చిమ టిడిపి కార్యాలయం వద్ద తెలుగు మహిళలు చెప్పులతో కొట్టి తమ నిరసనను వ్యక్తం చేశారు. తాను మాత్రం అందర్నీ విమర్శించవచ్చు, ఎదుటోళ్ళు విమర్శిస్తే దాన్ని భూతద్దంలో పెట్టి, మీడియా ముందుకు వచ్చి ఏడుస్తు నటిస్తోందన్నారు. బండారు సత్యనారాయణ తప్పు మాట్లాడారు అని విమర్శించే రోజా, మరి నారా బ్రాహ్మణి గురించి, నారా భువనేశ్వరి గురించి మీ ఎమ్మెల్యేలు చేసిన వ్యాఖ్యలకు ఏమి సమాధానం చెబుతారన్నారని సూటిగా ప్రశ్నించారు. విమర్శలు మానుకోవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో నసీమ, లంక బుజ్జి, విక్టోరియా, మట్టి లక్ష్మి, షకీల,లక్కు శాంతి, లక్ష్మి, జానకి, బచ్చు రామలక్ష్మి, ముర్రి అపర్ణ, వరలక్ష్మి, లక్ష్మీ మున్నీసా తదితరులు పాల్గొన్నారు.

వేగంగా ఓడరేవు నిర్మాణం : కలెక్టర్

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా) : నిర్దేశించిన లక్ష్యం ప్రకారం మచిలీపట్నం ఓడరేవు నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని, వివిధ పనులు పురోగతిలో ఉన్నాయని కష్ణా జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డి, ఏపీ మ్యారీ టైం బోర్డు సీఈవో ప్రవీణ్ కుమార్ లు క్యాంపు కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్రంలో ఎయిర్ పోర్టులు ఓడరేవులు ఉన్న జిల్లాల కలెక్టర్లతో సంభాషించగా సోమవారం కష్ణాజిల్లా కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్ పి.రాజాబాబు ఈ వీసీలో పాల్గొన్నారు. రాష్ట్రంలో వివిధ పోర్టుల అభివృద్ధి పనుల పురోగతిపై జిల్లాల వారీగా సిఎస్ జవహర్ రెడ్డి సమీక్షించారు. మచిలీపట్నం పోర్టు అభివద్ధి పనుల పురోగతి గురించి చీఫ్ సెక్రటరీ కలెక్టర్ పి.రాజాబాబును వివరించమని కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మచిలీపట్నం పోర్టు పనులు ఎటువంటి ఆటంకం లేకుండా నిర్విరామంగా కొనసాగుతున్నాయని, సముద్ర కెరటాలను అడ్డుకోవడానికి 2 కిలోమీటర్ల 325 మీటర్ల దక్షిణం, ఉత్తరం బ్రేక్ వాటర్ గోడల నిర్మాణాల భాగంగా ఇప్పటికి 825 మీటర్ల దూరం సముద్రంలోనికి కొండ రాళ్లను పూడ్చుకుంటూ పటిష్టంగా మున్ముందుకు చొచ్చుకుపోతున్నట్లు కలెక్టర్ పి.రాజాబాబు చెప్పారు. సౌత్ నార్త్ బ్రేక్ వాటర్ వాల్స్ నిర్మాణం కొరకు ఇప్పటివరకు సుమారు మూడున్నర లక్షల టన్నులకు పైగా కొండ రాళ్లను సముద్రంలో పూడ్చినట్లు


స్పందనలో అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ రాజాబాబు

పేర్కొన్నారు. అదేవిధంగా సముద్రంలో మరోవైపు నార్త్ బ్రేక్ వాటర్ నిర్మాణంలో కోర్ లయింగ్ దశ 250 మీటర్ల నిడివి సైతం పూర్తయిందని ఆయన తెలిపారు. మరోవైపు కస్టమ్స్, సెక్యూరిటీ తదితర భవనాల పునాది దశలో నిర్మాణ పనులు జరుగుతున్నట్లు చెప్పారు. ఇప్పటివరకు 40 ఎకరాలలో బెర్త్ రిలేటెడ్ ఫైలింగ్ పనులు జరుగుతున్నట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి, ఏపీ మ్యారీ టైం బోర్డు సీఈవో ప్రవీణ్ కుమార్ లకు కలెక్టర్ పి రాజబాబు వివరించగా మచిలీపట్నం పోర్టు నిర్మాణ పనులు జరుగుతున్న తీరుపై వారు సంతప్తి వ్యక్తం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో మచిలీపట్నం పోర్టు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం. శివయ్య, మెఘా ఇంజనీరింగ్ సంస్థ తరుపున రాఘవేంద్రరావు, రైట్ సంస్థ మేనేజర్ ఎంవిపి రవికుమార్, అసిస్టెంట్ మేనేజర్ జగదీష్ పాల్గొన్నారు.

స్పందన అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి : కలెక్టర్

స్పందన అర్జీలను నాణ్యత ప్రమాణాలను విధిగా పాటిస్తూ సకాలంలో పరిష్కరించేందుకు ప్రత్యేక దష్టి సారించాలని జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు జిల్లా అధికారులను ఆదేశించారు.సోమవారం నగరంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్, సంయుక్త కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్, మచిలీపట్నం ఆర్డిఓ శివ నారాయణ రెడ్డిలతో కలిసి జగనన్నకు చెబుదాం-స్పందన కార్యక్రమం నిర్వహించి పలు ప్రాంతాల ప్రజల నుండి విజ్ఞాపన పత్రాలు స్వీకరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అర్జీదారుల సమస్యలను ఎంతో ఓపికగా ఆలకించారు. సంబంధిత అధికారులను పిలిపించి అర్జీల పరిష్కారంపై సత్వరమే చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు వివిధ ప్రాంతాల నుండి ఎంతో శ్రమకోర్చి వ్యయప్రయాసలతో జిల్లా కేంద్రానికి వస్తున్నారని స్పందన అర్జీలకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి సానుకూలంగా పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో జ్యోతిబసు,డ్వామా, డిఆర్డిఏ పీడీలు జి.వి. సూర్యనారాయణ, పి ఎస్ ఆర్ ప్రసాద్,డిపిఓ నాగేశ్వర్ నాయక్, మున్సిపల్ కమిషనర్ చంద్రయ్య, ముడా విసి రాజ్యలక్ష్మి, డీఈవో తహేరా సుల్తానా, డిఎస్ఓ పార్వతి, బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసరావు, ఎస్సీ సంక్షేమ సాధికారత అధికారి షాహిద్‌బాబు, పంచాయతీరాజ్ ఎస్ఈ విజయ్ కుమారి, ఐసిడిఎస్ పిడి స్వర్ణ తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.



సెయింట్ జాన్స్ విద్యార్థుల ఫీల్డ్ ట్రిప్

ప్రజాశక్తి-బంటుమిల్లి: అంతర్జాతీయ పోస్టల్ దినోత్సవ సందర్భంగా సెయింట్ జాన్స్ విద్యార్థులు ఫీల్డ్ ట్రిప్ కింద తపాలా కార్యాలయాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్‌పి ఎం కే ప్రభు కుమార్ పోస్టల్ సేవలు గురించి, అలాగే ఉత్తరాల బట్వాడిలో వారు చేసే పనులు గురించి విద్యార్థులకు వివరించారు. అలాగే ఈ పోస్టల్ విభాగం పట్టణాల్లో కంటే పల్లెటూర్లకు ఎంతో ఉపయోగకరమని, రానున్న కాలంలో ఈ విద్యార్థులే రేపటి పౌరులు కనుక ఈ విద్యార్థులు వీరంతా కూడా పోస్టర్ సేవలు వినియోగించుకోవాలని అన్నారు. అనంతరం విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సెయింట్ జాన్ స్కూల్ డైరెక్టర్ సాబుజాన్ ఝాన్సీ సాబు, ఎం.వి రామకష్ణ, జి నాని, ప్రసాద్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు



టైపిస్టు పీటర్‌కు అభినందన

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు

పల్నాడు జిల్లా నరసారావుపేటలో ఈ నెల 8న సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ శతాధిక కవి సమ్మేళనంలో గుడ్లవల్లేరు మండల పరిషత్ కార్యాలయంలో టైపిస్టుగా పనిచేస్తున్న గుండాబత్తిన మరియ పీటర్ ప్రత్యేక ప్రశంసా పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా సోమవారం పలువురు ఆయనకు అభినందనలు తెలిపారు. ఎంపీడీవో దారపు శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు ఎలీషారావు, ఎజెఎల్ నరసింహారావు ప్రత్యేకంగా అభినందించారు.

రూ.10 వేలు అందజేత

ప్రజాశక్తి-ఘంటసాల

మండల పరిధిలోని లంకపల్లి పీఏసీఎస్ సభ్యునిగా ఉన్న పూషడం గ్రామానికి చెందిన కోళ్లపల్లి రాధాకృష్ణ ఇటీవల మృతిచెందారు. మతుని కుటుంబానికి రూ.10 వేల నగదును పీఏసీఎస్ ఆధ్వర్యం లో సోమవారం అందజేశారు. పీఏసీఎస్ చైర్ పర్సన్ గల్లా గిరీష్, కార్యదర్శి పామర్తి సోమేశ్వరరావు రాధాకృష్ణ భార్య నాగలక్ష్మికి ఈ నగదును అందజేశారు.

సెలీయో షోరూమ్ ప్రారంభం

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్

నగరంలోని పివిపి మాల్‌లో బ్రాండ్ సెలియో సరికొత్త దుస్తుల షోరూం సోమవారం ప్రారంభమైంది. షోరూంను సిఇఒ సత్యన్.ఎం ప్రారంభించారు. మూడో అతి పెద్ద స్టోర్ విజయవాడలో ప్రారంభించినట్లు తెలిపారు. ఇక్కడ లెనిన్ కలెక్షన్, అధు నాతన పోలో షర్ట్స్, డెనిమ్, ఫ్యాషన్ జాకెట్లు, వైబ్రంట్ టై - డై షర్ట్స్, వెచ్చని శీతాకాలపు షర్ట్స్, బాటమ్ వేర్, అన్ని రకాల జీన్స్ వుంటాయని తెలిపారు. పండుగల సందర్భంగా ప్రత్యేక ఆఫర్స్ కూడా వుంటాయని తెలిపారు.

గడువులోగా అర్జీలను పరిష్కరించాలి : కలెక్టర్


వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ డిల్లీరావు

ప్రజాశక్తి-విజయవాడ: ప్రజా సమస్యల పరిష్కారానికి స్పందన ఒక ప్రత్యేక వేదిక అని, స్పందన కార్యక్రమం ద్వారా ప్రజలు ఆశించిన స్థాయిలో సమస్యలు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు అన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమంలో భాగంగా సోమవారం నగరంలోని కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశంలో జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు, జాయింట్ కలెక్టర్ డా. పి. సంపత్ కుమార్, ఇన్‌చార్జ్ డిఆర్‌వో జి. వెంకటేశ్వర్లులు ఆర్జీదారుల నుండి 161 వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ డిల్లీరావు మాట్లాడుతూ స్పందనలో సమర్పించే ఆర్జీలకు నిర్ధిశించిన గడువులోగా పరిష్కారం చూపాలన్నారు. అర్జీలు ఏ స్థాయిలోను తిరిగి నమోదు కాకుడదన్నారు. సమస్యల పరిష్కారానికి స్పందన ఎకైక మార్గమని ఆర్జీదారులు ఎంతో ఆశతో స్పందనలో అర్జీలను అందజేస్తుంటారన్నారు. వాటిని క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాల్సిన భాధ్యత మనపై ఉందన్నారు. గ్రామ వార్డు సచివాలయాలు, స్పందన మొబైల్ యాప్, వెబ్ అప్లికేషన్ ద్వారా అర్జీలు నమోదవుతుంటాయన్నారు. ఆఫ్ లైన్, అన్ లైన్‌లో నమోదవుతున్న అర్జీలపై సంబంధిత శాఖల అధికారులు దృష్టి పెట్టాలని కలెక్టర్ డిల్లీరావు అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సత్తెమ్మకు నివాళి

ప్రజాశక్తి-విజయవాడ: కృష్ణలంక 22వ డివిజన్లో సిపిఎం సీనియర్ సభ్యులు బాలబొమ్మ సత్తెమ్మ సంస్మరణ కార్యక్రమం పార్టీ తూర్పు సిటీ కమిటీ కార్యదర్శివర్గ సభ్యులు బత్తుల చిన్నారావు అధ్యక్షతన జరిగింది. ముందుగా సత్తెమ్మ చిత్రపటానికి పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చిగురుపాటి బాబూరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాధ్, ఇతర నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సత్తెమ్మ కుటుంబం మొత్తం డివిజన్‌లో పార్టీకి వెన్నుదన్నుగా నిలిచిందన్నారు. పార్టీ ఇచ్చిన పిలుపుల్లో చురుకుగా పాల్గొనే సత్తెమ్మ మరణం తీరని లోటు అని అన్నారు. ఆమె చివరి వరకు పార్టీకి అంకితభావంతో పనిచేశారని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సెంట్రల్ సిటీ కార్యదర్శి భూపతి రమణారావు, జిల్లా కమిటీ సభ్యులు పుప్పాల కష్ణ, నాయకులు విజ్జి గురుమూర్తి, తాత సాంబయ్య, కాయల లక్ష్మణరావు, టి తాండవకృష్ణ, వాజ శ్రీనివాసరావు, కాయల కుమారి, ఎస్‌కె జాన్‌బి, సత్తెమ్మ కుమారుడు బాల బొమ్మ లక్ష్మణ పాల్గొన్నారు.

వీఎంసి స్పందనకు 21 అర్జీలు

ప్రజాశక్తి-విజయవాడ: ప్రజా సమస్యల పరిష్కార వేదికగా జరుగుతున్న స్పందన కార్యక్రమంలో అందుకున్న విజ్ఞప్తులకు సంతప్తికర పరిష్కారాలు అందించాలని, సమస్యలు పునరావతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సూచించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్ నందు సోమవారం ఏర్పాటు చేసిన స్పందన కార్యక్రమంలో కమిషనర్ పాల్గొని వివిధ సమస్యలపై వచ్చిన 21 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



దసరా ఉత్సవాల ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి-వన్‌టౌన్: దుర్గగుడి దసరా ఉత్సవాలకు సంబంధించి సోమవారం ఆలయ కార్యనిర్వాహణాధికారి దర్భముళ్ల భ్రమరాంబ, దసరా చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ చంద్రశేఖర్ ఆజాద్‌తో కలిసి ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఇందులో భాగంగా సీతమ్మవారి పాదాలు వద్ద కేశఖండన కొరకు ఏర్పాట్లు, హోల్డింగ్ ఏరియా, ప్రసాదం కౌంటర్లు, స్నాన ఘాట్లు, షవర్లు, క్యూ లైన్ ఏర్పాట్లు, పార్కింగ్ ప్రదేశాలు తదితరచోట్ల వద్ద చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు సూచనలిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహక ఇంజినీర్ లింగం రమాదేవి, సిబ్బంది పాల్గొన్నారు. యాత్రికుల కోసం ఏర్పాటు చేస్తున్న షెడ్డు నిర్మాణ పనులను సోమవారం ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు పరిశీలించారు. ఈ పనులు వీలైనంత త్వరగా మరియు అత్యంత పటిష్టంగా నిర్మించాలని ఆలయ అధికారులకు చైర్మన్ సూచించారు.


క్యూలైన్ల పనులను పరిశీలిస్తున్న దసరా చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ ఆజాద్, ఇఓ భ్రమరాంబ



'కృష్ణాజలాలపై నిర్ణయాన్ని పున:పరిశీలించాలి'

ప్రజాశక్తి-బంటుమిల్లి: కృష్ణాజలాలపై కేంద్ర క్యాబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని పున:పరిశీలించాలని ఎపి రైతు సంఘం నాయకులు కోరారు. సోమవారం బంటుమిల్లిలోని సిపిఎం కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ తెలంగాణ ఎన్నికల సందర్భంగా కృష్ణాజలాల విషయంలో కేంద్రం తీసుకున్న నిర్ణయం ఆంధ్ర రాష్ట్రానికి, వ్యవసాయ రంగానికి తీవ్ర అన్యాయం చేసినట్లు అయ్యిందన్నారు. కేంద్రం తీసుకున్న అనాలోచిత నిర్ణయాన్ని సిఎం జగన్ వ్యతిరేకించాలన్నారు. బచావత్ ట్రిబ్యునల్ తీర్పునే కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు, సీనియర్ నాయకులు సుజ్ఞానం జనార్ధన్‌రావు, మండల కార్యదర్శి లంకదాసు అజయ్‌గోష్, కృత్తివెన్ను అధ్యక్షుడు పట్టపు ఏసుబాబు, పాశం సూర్యచంద్రరావు, గ్రంధం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు భవన నిర్మాణ కార్మికుల ధర్నా



కరపత్రాలు పంపిణీ చేసిన కార్మికులు

పెనుగంచిప్రోలు : భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళ వారం విజయ వాడ అలంకార్ సెంటర్ ధర్నా చౌక్ వద్ద నిర్వహించే ధర్నా కార్యక్రమానికి మండలంలోని భవన నిర్మాణ కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని మండల సిఐటియు కార్యదర్శి దారా నాగేశ్వరరావు కోరారు. సోమవారం మండల కేంద్రంలో ఈ ధర్నా కార్యక్రమానికి సంబంధించిన పని బంద్ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులు పోరాడి సాధించుకున్న సంక్షేమ బోర్డును రాష్ట్ర ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కార్మికులు నరసింహారావు, అనిల్, నాగరాజు, రామయ్య, లక్ష్మి నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.



విధులు బహిష్కరించిన న్యాయవాదులు

న్యాయవాదుల విధుల బహిష్కరణ

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసనలు తెలిపారు. ఇటీవల బార్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ప్రతి పిటిషన్‌కు 20 రూపాయలు వెల్ఫేర్ స్టాంపు అతికించమని ఉత్తర్వులు జారీ చేయటాన్ని న్యాయవాదులు వ్యతిరేకించారు. సీనియర్ న్యాయవాది యర్రంరెడ్డి బాబురావు మాట్లాడుతూ బార్ కౌన్సిల్ సభ్యులు బార్ అసోసియేషన్లతో ఎలాంటి సంప్రదింపులు చర్చలు జరపకుండా ఏకపక్ష నిర్ణయం తీసుకోవటాన్ని నందిగామ న్యాయవాదులు తప్పు పట్టారు. జూనియర్ న్యాయవాదులు చాలా ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ బొబ్బిలిపాటి భాస్కర్, స్పోర్ట్స్ అండ్ కల్చర్ సెక్రటరీ షేక్ ఆజాద్, సీనియర్ న్యాయవాదులు కాట్ర సత్యనారాయణ, యర్రం రెడ్డి బాబురావు, మన్నెం నారాయణరావు, చరణ్ పాల్గొన్నారు.

విత్తనోత్పత్తిపై శిక్షణ

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : మండలంలోని తక్కెళ్ళపాడు గ్రామంలో గ్రామీణ విత్తనోత్పత్తి కార్యక్రమంపై సోమవారం రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. డిఆర్‌సి, ఎడిఎ మనీషా రైతులకు తమకు అవసరమైన విత్తనాలను తామే ఉత్పత్తి చేసుకోవచ్చుని విత్తనం తయారు చేసుకోవడానికి పంట విత్తనం దగ్గర నుండి కోత, నిలువ ఉంచే వరకు మెళకువలను రైతులకు తెలియజేశారు. మండల వ్యవసాయ అధికారి వి.వరలక్ష్మి మాట్లాడుతూ రైతులందరూ తప్పనిసరిగా ఈ క్రాఫ్, ఈ కేవైసీ చేయించుకోవాలని, ఇంకా ఎవరైనా చేయించుకోని వారు రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి చేసుకోవాలని, ఈ నెల 10వ తేదీ వరకు మాత్రమే ఈ అవకాశం ఉందని తెలిపారు. ఈకేవైసీ చేయించుకున్న వారికి మాత్రమే ప్రభుత్వ పథకాలు, పంట రుణాలు, ధాన్యం కొనుగోలు, ఇన్పుట్ సబ్సిడీ, సున్న వడ్డీ రుణాలు వంటివి వర్తిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో విఎంలు భరత్, వెంకటేష్, రైతులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవి బాధితులకు పౌష్టికాహారం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: కర్లపాటి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీ శ్రీ స్వామి రామానంద సరస్వతి స్వామి వారి ఆశీస్సులతో హెచ్‌ఐవి బాధిత పిల్లలకు పౌష్టికాహారాన్ని (పోస్టర్ కేర్) అందజేసినట్లు ఆ సంస్థ వ్యవస్థాపకులు సామాజికవేత్త కర్లపాటి వెంకట శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం ట్రస్ట్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో కర్లపాటి మాట్లాడుతూ స్వామి వారి ఆశీస్సులతో ట్రస్టు సేవలు భవిష్యత్తులో కూడా కొనసాగించినట్లు తెలిపారు. ప్రస్తుతం ఆరు వేల రూపాయల విలువైన ఆహార సామాగ్రిని ఆరుగురు బాలలకు అందజేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో చిట్టూరి నరసింహారావు, రావూరి నాగేశ్వరరావు, మద్దుకూరి రాంబాబు, శ్రేయస్సు సిబ్బంది కోటి, ట్రస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

అధిక ఫీజుల దోపిడీ అరికట్టాలని వినతి



నందిగామ ఆర్డీఓ రవీంద్ర రావుకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి - నందిగామ : కార్పొరేట్ విద్యాసంస్థలు అధిక ఫీజులు దోపిడీ అరికట్టాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నందిగామ ఆర్‌డిఒ రవీంద్రరావుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. అనుమతులు లేకుండా నడుస్తున్న విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు గోపి నాయక్ మాట్లాడుతూ ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా విద్యాసంవత్సరం ప్రారంభం నుండి తల్లిదండ్రులకు ఫీజులవాత విద్యార్థులకు పుస్తకాల మోత తప్పడం లేదన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ఫీజులకంటే ఏ మాత్రం ఎక్కువ వసూలు చేయరాదని, అలా చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని రాష్ట్ర ప్రభుత్వం, పాఠశాల విద్యాశాఖ పదేపదే హెచ్చరిస్తున్నా కొన్ని సంస్థలకు నోటీసులు జారీ చేస్తున్నా ఇవేమీ తమకు పట్టనట్టుగా కొన్ని యాజమాన్యాలు ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తున్నాయన్నారు. 2019 నుండి పెండింగ్‌లో ఉన్న కాస్మోటిక్ ఛార్జీలు విడుదల చేయాలన్నారు. సంక్షేమ హాస్టల్‌లో నాడు – నేడు పనులు ప్రారంభించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఎంఇఒ, డివైఇఒ పోస్టులు భర్తీ చేయాలని, ఖాళీగా వర్కర్ పోస్టు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ నాయకులు హసేను, కర్రి వెంకటేశ్వరరావు, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

బ్లాక్‌లో ఎరువులు అమ్మితే చర్యలు



ప్రజాశక్తి - నందిగామ : నందిగామ నియోజకవర్గంలో ఎరువులు పురుగు మందులు బ్లాక్‌లో అధికధరలకు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని నందిగామ అగ్రికల్చరల్ ఎడిఏ కె.శ్రీనివాస్ హెచ్చరించారు. సోమవారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు, పురుగుమందులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. బ్లాక్ మార్కెట్లో అధిక ధరలకు ఎరువులు పురుగు మందులు కొనుగోలు చేసి మోసపోవద్దని రైతులకు సూచించారు. యూరియా ఎరువు కొరతలేదని రైతు భరోసా కేంద్రాల్లో స్టాక్ ఉందని చెప్పారు. పత్తి పంటలో రసం పీల్చు పురుగుల నివారణకు లింగాకర్షణ బుట్టలు వాడాలని కోరారు. మాగాణి పంటలో కలుపు నివారణకు జింక్ సల్ఫేట్ వాడాలన్నారు. పంటలకు ఎక్కువగా రసాయనక ఎరువులు వాడవద్దని సహజసిద్ధమైన సేంద్రియ ఎరువులు వినియోగించాలని కోరారు.

అక్రమ మద్యం పట్టివేత

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : ఆంధ్ర, తెలంగాణ రాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన గరికపాడు చెక్ పోస్ట్ వద్ద రోజు వారి తనిఖీల్లో భాగంగా ఆదివారం రాత్రి తెలంగాణ రాష్ట్రం నుండి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తెలంగాణ మద్యాన్ని 24 ఫుల్ బాటిళ్లను జోగి వెంకట పవన్ సుందర్ కారులో తరలిస్తుండగా ఎంతో చాకచక్యంగా వ్యవహరించి సెబ్ ఎస్ఐ ఎం రాంప్రసాద్ అధ్వర్యంలో హెడ్ కానిస్టేబుల్ ఉమామహేశ్వరరావు, కానిస్టేబుల్ శేఖర్ తనిఖీ చేస్తుండగా కారులో తెలంగాణ మద్యాన్ని గమనించి పట్టుకొని జగ్గయ్యపేటలో ఉన్న సెబ్ స్టేషన్‌కి తరలించారు. ఎస్ఐ హనీఫ్ సెక్షన్ 34 కింద కేసు నమోదు చేసి కార్‌ని సీజ్ చేసి జోగి వెంకట పవన్ సుందర్‌ని రిమాండ్‌కు పంపారు.

కృష్ణలంకలో బిల్డర్ ఆత్మహత్య

ప్రజాశక్తి - విజయవాడ : కృష్ణలంక 21వ డివిజన్ శంకర్‌మఠం బజారులో బిల్డర్ దాసరి హనుమంతరావు (55) (అలియాస్)... అనిల్‌కుమార్ సోమవారం ఉదయం 8.40 సమయంలో ఇంట్లో ఆత్మహత్య చేసుకున్నాడు. కృష్ణలంక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కుటుంబ కలహాలు, అప్పుల బాధతో మానసికంగా కుంగిపోయి ఆత్మహత్య చేసుకుంటున్నట్లు తన సూసైడ్ నోట్‌లో పేర్కొన్నట్లు పోలీసులు తెలిపారు. భార్యాభర్తలు ఏడాదిన్నర నుంచి విడిగా ఉంటున్నారు. తన భర్త తనను వేధిస్తున్నాడని మూడు నెలల క్రితం భార్య కృష్ణలంక పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కరోనా సమయంలో బిల్డర్‌గా తాను పెద్ద మొత్తంలో నష్టపోయానని తన సూసైడ్ నోట్‌లో బిల్డర్ పేర్కొన్నాడు. అయితే ఈ కేసులో తగిన న్యాయం జరగదేమోననే సందేహంతో తన ఇంట్లోనే ఉంటున్న కృష్ణలంక పోలీస్టేషన్‌లో పని చేస్తున్న ఎస్ఐ మనోహర్‌కు ఈ కేసును ఇన్వెస్టిగేషన్‌కు ఇవ్వొద్దంటూ తన సూసైడ్ నోట్లో బిల్డర్ పేర్కొన్నాడు. మృతుడు హనుమంతరావుకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు అమెరికాలో ఉండగా, కుమార్తె దుబాయ్‌లో ఉంటుంది. బిల్డర్ మృతిపై ఆ ఇంటి వాచ్‌మెన్ దుర్గాబాబు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ దుర్గారావు తెలిపారు.

దేవస్థాన మండపం పనులు పూర్తి



శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ పనులను పరిశీలిస్తున్న ఆలయ అధ్యక్షులు వంజరపు సూర్యారావు తదితరులు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : స్థానిక కొత్తపేటలోని శ్రీ సత్య భామ రుక్మిణి సమేత వేణుగోపాలస్వామివారి దేవాలయ ప్రాంగణంలోని మండపం స్లాబ్ నిర్మాణ పనులు సోమవారం జరిగాయి. శ్రీ వేణుగోపాల స్వామి వారి దేవస్థానంలో అభివద్ధి పనుల నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం కోటి రూపాయల నిధులను మంజూరు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో దేవాలయ ప్రాంగణంలో షాపుల నిర్మాణ పనులు దాదాపు పూర్తయ్యాయి. అటుపై నిర్మాణంలో ఉన్న మండపం పనుల్లో భాగంగా సోమవారం స్లాబ్ వేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం కమిటీ అధ్యక్షులు వంజరపు సూర్యారావు, దేవాదాయ శాఖ ఏఈ డి.నాగేంద్ర కుమార్‌తో పాటు కమిటీ సభ్యులు పాల్గొని స్లాబ్ నిర్మాణ పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షులు వంజరపు సూర్యారావు మాట్లాడుతూ దేవాదాయ శాఖ మాజీ మంత్రి, పశ్చిమ నియోజకవర్గం శాసనసభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు తమకు ఎంతో తోడ్పాటు అందిస్తూ శ్రీ వేణుగోపాలస్వామి వారి దేవస్థానం అభివద్ధికి ఎంతగానో సహకరిస్తున్నారని చెప్పారు. అలాగే మండపం స్లాబ్ నిర్మాణం కోసం విద్యుత్తు విషయమై తాము అడిగిన వెంటనే స్పందించి స్లాబ్ నిర్మాణం పూర్తయ్యేవరకు విద్యుత్తును నిలుపుదల చేసినందుకు విద్యుత్ శాఖ అధికారులకు అభినందనలు తెలిపారు.

ఇళ్లిప్పిస్తానని మోసగించిన నలుగురు అరెస్టు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : జెఎన్ఎన్‌యుఆర్ఎం ఇళ్లు ఇప్పిస్తానని చెప్పి మోసగించిన కేసులో నలుగురిని టూటౌన్ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు పేదవారికి మున్సిపల్ కార్పొరేషన్ వారు నిర్మించిన జక్కంపూడి వైఎస్ఆర్ కాలనీ, కబేళా, వాంబే కాలనీలలో నిర్మించిన జెఎన్ఎన్‌యుఆర్ఎం కాలనీలో ఖాళీగా వున్న ఫ్లాట్ ఇప్పిస్తామంటూ ఓ మహిళతో పాటు మరో ముగ్గురు వ్యక్తులు మోసగించారంటూ టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో చిట్టినగర్, రాయప్ప రాజు వీధిలో నివాసం వుండే చిన్ని నరసింహారావు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కేసు నమోదుచేసిన టూటౌన్ సిఐ సుబ్రహ్మణ్యం నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారిలో ఖుద్దూస్ నగర్, కేదారేశ్వరిపేటకు చెందిన షేక్ హబీబ్, వైఎస్ఆర్ కాలనీ, జక్కంపూడికి చెందిన షేక్ లాల్ అహమద్ అలియాస్ బాజా బాబా, వైఎస్ఆర్ కాలనీకి చెందిన నిమ్మల అన్నపూర్ణ, న్యూ రాజరాజేశ్వరిపేట, సుబ్బరాజునగర్‌కు చెందిన షేక్ మహమ్మద్ హుస్సేన్‌లను సోమవారం అరెస్టుచేసి, చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా వారిని 14 రోజులు రిమాండ్ విధించినట్లు తెలిపారు.



డాక్టర్ తారక ప్రసాద్‌కు పలువురు అభినందనలు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : మత్తు వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన విజయవాడ ఇఎస్ఐ (కార్మిక బీమా) ఆస్పత్రి సివిల్ సర్జన్ డాక్టర్ ఉప్పులేటి తారక ప్రసాద్‌ను పలువురు అభినందించారు. ఇండియన్ సొసైటీ ఆఫ్ ఎనస్తీషియా జాతీయ మాజీ అధ్యక్షులు డాక్టర్ కె.ఆర్.ఎన్.ఠాగూర్, డాక్టర్ ఎ.కామేశ్వరరావు, ఐఆర్‌సిఎఫ్ చైర్మన్ డాక్టర్ ఎస్ఎస్‌సి చక్రరావు, రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఆళ్ల ప్రశాంతి, విశాఖపట్నం బ్రాంచి అధ్యక్షులు డాక్టర్ అల్లు పద్మజ, నేషనల్ పెస్ట్ జిసి సభ్యులు డాక్టర్ జి.కిరణ్‌కుమార్, సిద్ధార్థ వైద్య కళాశాల ఎనస్తీషియా ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.వినయకుమార్ తదితరులు ఆయనను అభినందించిన వారిలో ఉన్నారు. ఈనెల 6 నుండి 8వ తేదీ వరకు విశాఖపట్నంలో సుమారు వెయ్యి మందితో జరిగిన మత్తు వైద్యుల సంఘం 32వ వార్షిక సదస్సులో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులుగా ఉప్పులేటి తారక ప్రసాద్, డాక్టర్ అచ్యుతరామయ్య, ఉపాధ్యక్షులుగా డాక్టర్ రామారావు, ప్రెసిడెంట్ ఎలెక్ట్‌గా డాక్టర్ సూరిశెట్టి శ్రీనివాస్, ట్రెజరర్‌గా డాక్టర్ వి.శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు మత్తువైద్యుల సంఘం జాతీయ మాజీ అధ్యక్షులు డాక్టర్ వంకినేని కుచేలబాబు ప్రకటించారు.

నేటితో ఈ క్రాప్‌కు ఈకేవైసీ గడువు పూర్తి

ప్రజాశక్తి-గంపలగూడెం: మంగళవారంతో (నేటితో) రైతులు వేసిన పంటలకు అవసరమైన ఈ క్రాప్, ఈకేవైసీ గడువు ముగుస్తున్నట్లు ఊటుకూరు వ్యవసాయ సహాయకులు పసుపులేటి నరహరి తెలిపారు. పెసర, కంది, మినుము, మిర్చి, పత్తి, వరి మొక్కజొన్న, పసుపు తదితర పంటలకు ఈకేవైసీ చేయకపోతే రైతుల కు ప్రభుత్వం నుండి పంట నష్టపరిహారం, పంటల బీమా వర్తించదని తెలిపారు.

పెనుగంచిప్రోలులో 'సంకల్ప సప్త'

పెనుగంచిప్రోలు : చిల్లకల్లు ఐసిడిఎస్ ప్రాజెక్టు వారి ఆధ్వర్యంలో మండల స్థాయిలో సంకల్ప సప్త కార్యక్రమాలను సోమవారం నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల అంగన్వాడీ కార్యకర్తలు పోషకాలతో కూడిన వివిధ రకాల పౌష్టికాహారం తయారు చేసి ఎగ్జిబిషన్ నిర్వహించారు. సిడిపిఒ లక్ష్మి భార్గవి సూపర్ వైజర్ ఉషారాణి, అంగన్వాడీ కార్యకర్తలు సువర్చలా నాగమణి విజయలక్ష్మి రమాదేవి రజనీ అనూరాధ, లక్ష్మి, పాల్గొన్నారు.

ఆర్యవైశ్య ప్రముఖులు కొల్లా మృతి

ప్రజాశక్తి - గంపలగూడెం: పట్టణ ఆర్యవైశ్య, వ్యాపార ప్రముఖులు కొల్లా నాగేశ్వరరావు (70) మృతి చెందారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమారులు. ద్వితీయ కుమారుడు వెంకట నాగరాజుగుప్తా పట్టణ ఉప సర్పంచ్‌గా ఉన్నారు. పట్టణ ఆర్యవైశ్యులు, ప్రముఖులు, ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించి, కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. తిరువూరు లైన్స్‌క్లబ్ ప్రతినిధి అడ్వకేట్ అండ్ నోటరీ గోగిరెడ్డి కృష్ణారెడ్డి సారథ్యంలో మృతుని నేత్ర దానం చేశారు. ఎల్‌వి.ప్రసాద్ ఆస్పత్రి సిబ్బంది నేత్రాలను సేకరించారు.

డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని ఆందోళన



ఆందోళన చేస్తున్న మహిళలు

ప్రజాశక్తి-హనుమాన్‌జంక్షన్ : డ్రైనేజీ సమస్య పరిష్కరించడంలో అధికారుల అలసత్వాన్ని నిరసిస్తూ బండారిగూడెం గ్రామలో మహిళలు సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. అస్తవ్యస్తంగా మారిన డ్రైనేజీ వ్యవస్థతో కొన్నేళ్లుగా అవస్థలు పడుతున్నామని, పట్టించుకున్న నాథుడే లేడని వాపోయారు. రోడ్లు అధ్వా నంగా మారడంతో పాటు దోమల దాడులతో గ్రామంలో విష జ్వరాలు ప్రబలుతు న్నాయ న్నారు. ఏళ్ల తరబడి రోడ్లమీద మురుగు పారుతున్నా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్లపైకి రావాలంటేనే వద్దులు, చిన్నపిల్లలు, వికలాంగులు భయపడుతున్నారని డ్రైనేజీ సమస్యను అధికారుల దృష్టికి ఎన్నిసార్లు తీసుకు పోయినా పరిష్కారం కాలేదని గ్రామ మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. వర్షం వస్తే, మురుగు నీరు, వర్షపు నీరు రోడ్లపైకి వచ్చి ఇండ్లలోకి చేరుతుందని తెలిపారు.దీంతో గ్రామస్తులు అనేక రోగాలబారిన పడుతు న్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రైనేజీ సమస్య ను అటు అధికారులు,ఇటు ప్రజా ప్రతినిధులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు గ్రామంలో అండర్‌డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేసి, వీధి దీపాల ఏర్పాటుతో పాటు పాడైపోయిన తాగునీటి పైపులైన కు మరమ్మతులు చేయాలని డిమాండ్ చేశారు.లేని పక్షంలో గ్రామ ప్రజలతో కలిసి స్థానిక పంచాయతీని ముట్టడి స్తామని హెచ్చరించారు.



మాట్లాడుతున్న ఉపకులపతి జి .జ్ఞానమణి

ఉద్యోగులు నిబద్ధతతో పనిచేయాలి

- కెయు ఉపకులపతి ఆచార్య జి. జ్ఞానమణి

ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ : వ్యక్తిగత ప్రయోజనాలు కంటే విశ్వవిద్యాలయ ప్రయోజనాలే ముఖ్యమని భావించి ఉద్యోగులు విధులు నిర్వర్తించాలని కష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య జి జ్ఞానమణి సూచించారు. విశ్వవిద్యాలయ ఉద్యోగులకు సోమవారం స్థానిక విశ్వ విద్యాలయ ఆడిటోరియం లో ఎస్టాబ్లిష్మెంట్, అకౌటింగ్ అంశాలు పై ఏర్పాటు చేసిన వర్క్‌షాప్ ను ఆయన ప్రారం భించారు. ఈ సందర్భముగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు హేతుబద్ధత, సమన్వయం తో పనిచేయాలి అని పిలుపునిచ్చారు. రిజిస్ట్రార్ డాక్టర్ బ్రహ్మచారి మాట్లాడుతూ ఉద్యోగులు మధ్య సంబంధాలు కార్యాలయ పని పై ప్రభావం చూపుతాయని పేర్కొన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం విశ్రాంత ఆర్థిక గణాంక అధికారి జనార్ధనరావు ఉద్యోగులకు శిక్షణ ఇచ్చారు. ఇన్వర్డ్, ఔట్వర్డ్ ల మధ్య రిజిస్టర్ ల నిర్వహణ తో పాటు తపాల్సు, దిస్పోసల్ మధ్య వేగవంతమైన పనితీరు వుండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్థిక గణాంక అధికారి ఎం డి ఎస్ ఎస్ రతన్, ఆచార్యులు పాల్గొన్నారు.

స్థల పరిశీలన

ప్రజాశక్తి-చల్లపల్లి : చల్లపల్లి మండలం లక్ష్మీపురం పంచాయతీ పరిధిలోని రామానగరంలో కమ్యూనిటీ హాల్ నిర్మించనున్న స్థలాన్ని రోటరీ క్లబ్ ప్రతినిధులు సోమవారం పరిశీలించారు. ఈ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి మచిలీపట్టణం ఎంపీ వల్లభనేని బాలశౌరి సీఎస్ఆర్ నిధులు రూ.కోటి వరకు సమీకరిస్తున్నారు. ఈ నేపథ్యంలో రోటరీ క్లబ్ భాగస్వామ్యం కోసం క్లబ్ ప్రతినిధులు స్థలం పరిశీలించారు. సర్పంచ్ కొల్లూరి కోటేశ్వరరావు, కేసీపీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా చే గువేరా వర్ధంతి



చెగువేరా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి మచిలీపట్నం రూరల్ : భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో క్యూబా దేశ విప్లవ కారుడు చేగువేరా 56వ వర్ధంతి కార్యక్రమం సోమవారం మచిలీపట్నంలోని స్టార్ కాలేజ్ లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎస్ సమరం మాట్లాడుతూ క్యూబా దేశ స్వతంత్రం కోసం అనేక ఉద్యమాలు చేసి క్యూబా దేశానికి స్వతంత్ర అందించిన గొప్ప స్వతంత్ర వీరుడు విప్లవకారుడు చేగువేరా వర్ధంతి కార్యక్రమాన్ని చేయడం ఆనందదాయకం అన్నారు. దేశ స్వతంత్ర ఉద్యమంలో పోరాడుతూనే ప్రపంచానికి ఆలోచన విధానాన్ని, స్వతంత్ర పోరాటాన్ని ,ఉద్యమాన్ని ప్రణాళిక లను అందించే విధంగా ప్రపంచానికి ఆదర్శవంతంగా నిలిచారన్నారు. చేగువేరా ఈరోజు టీ షర్ట్ ల మీద బైక్ పోస్టర్ ల మీద ఒక ఫ్యాషన్ హీరో లాగా చూస్తున్నారని యువకులు అర్థం చేసుకునే విధంగా ఆయన జీవితం ఉంది.కానీ ఆయన విప్లవ వీరుడు,క్యూబాలో వైద్యుడిగా అనేక సేవా కార్యక్రమాలు చేసి ప్రజల స్వేచ్ఛ స్వతంత్రం కోసం ఆయన పోరాడిన విధానాన్ని నేటి యువతీ,యువకులు తెలుసుకోవాలని,ఆస్మానే వ్యాధితో బాధపడుతున్నా స్వతంత్ర ఉద్యమాన్ని కొనసాగిస్తూనే ప్రపంచానికి ఒక కొత్త నిర్వచనాన్ని పోరాడే తత్వాన్ని అందించిన మహావీరుడు అమెరికా సైన్యానికి బందీ అయి వారి హింసకాండకి తన ప్రాణాలను అర్పించిన విప్లవీరుడు చేగువేరా తన ఆశయాన్ని ముందు తీసుకెళ్తామని ఆయన కలలు కన్న స్వప్నాన్ని నెరవేరుస్తామని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సుఖేష్ ,జిల్లా సహాయ కార్యదర్శి రాజేష్, జిల్లా ఉపాధ్యక్షుడు కీర్తి, స్టార్ కాలేజ్ విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రెయిన్ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-ఉయ్యూరు : ఉయ్యూరు నగర పంచాయతీ పరిధి 10, 11 వార్డులలో రూ. 35 లక్షల నిధులతో సీసీ డ్రైన్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే కేపీ సారథి సోమవారం శంకుస్థాపన చేశారు. 10వ వార్డు కొబ్బరితోటలో రూ.20 లక్షలు, 11వ వార్డు ఏజీకే నగర్లో రూ. 15 లక్షలతో డ్రైన్ ల నిర్మాణం చేపడుతున్నట్టు ఈ సందర్భంగా తెలిపారు. నగరపంచాయతీ చైర్మన్ వల్లభ నేని సత్యనారాయణ, వైస్ చైర్మన్ సోలె సురేశ్, కౌన్సిలర్లు వూర శ్రీవాణి, జంపాన పూర్ణిమ, తెనాలి పద్మ, కో-ఆప్షన్ సభ్యుడు ఖలీల్, కమిషనర్ వెంకటేశ్వరరావు, పట్టణ వైసీపీ అధ్యక్షుడు అబుకలాం, ప్రభుత్వ వైద్యశాల అభివద్ధి కమిటీ చైరన్ జంపాన కొండలరా వు తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా జెమినీస్కూల్ సమీపాన టిడ్కో ఇళ్ళ నిర్మాణ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు.

ప్రమాదకరంగా చిక్కవరం రహదారి

ప్రజాశక్తి-గన్నవరం: గన్నవరం మండలం కొత్తగూడెం నుంచి వీరపనేనిగూడెం, చిక్కవరం గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారి పూర్తిగా ధ్వంసమైంది. దీంతో ద్విచక్ర వాహనచోదకులు ఆదమరిస్తే ఆసుపత్రికి వెళ్లాల్సి వస్తోంది. రాత్రి ఈ రోడ్డుపై ప్రయాణం నరకాన్ని చూపిస్తోంది. దాదాపు దశాబ్దం క్రితం జిల్లా పరిషత్ ఆధ్వర్యంలో ఈ రహదారిని అభివద్ధి పరిచారు. ఐదేళ్లకు రోడ్డు పాక్షికంగా దెబ్బతింది. ఆ తర్వాత ఐదేళ్లుపారెడు కంకర వేసింది లేదు. ట్రాక్టర్ల తాకిడికి అవి రాళ్లుతేలి గోతులు పెద్దవిగా మారాయి. ఈ రహదారిపై ప్రయాణం ప్రమాదకరంగా మారింది.

రైతుల బాధలు వర్ణనాతీతం : కొత్తగూడెం, చిక్కవరం, వీరపనేనిగూడెం గ్రామాల మధ్య పది కిలో మీటర్ల దూరం ఉంటుంది. రహదారికి ఇరువైపులా పంట పొలాలు ఉన్నాయి. దాదాపు రెండు వేల ఎకరాలలో వరి, అపరాలు, చెరుకు సాగవుతోంది. నిత్యం రైతులు పొలాల కు వెళ్తారు. రోడ్డంతా గోతులు పడటంతో నడవటానికి అగచాట్లు పడుతున్నారు. ద్విచక్ర వాహనంపై వెళితే ఎక్కడ పడిపోతామో అన్న భయం వారిలో నెలకొంది.

నవంబర్ 15 నుండి 'ఆడుదాం ఆంధ్ర' పోటీలు : జెసి



ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : వచ్చే నవంబర్ 15వ తేదీ నుండి డిసెంబర్ 21వ తేదీ వరకు ఆడుదాం ఆంధ్ర పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా సంయుక్త కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్లోని స్పందన సమావేశ మందిరంలో రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ నుండి జిల్లాకు అందిన పలు రకాల క్రీడా సామాగ్రిని సంయుక్త కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంయుక్త కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో వచ్చే నవంబర్ 15వ తేదీ నుండి ఆడుదాం ఆంధ్ర క్రీడల పోటీలు నిర్వహిస్తామన్నారు. అందులో ముఖ్యంగా వాలీబాల్, బ్యాడ్మిం టన్, కబడ్డీ, క్రికెట్ వంటి పోటీలు ఉంటాయన్నారు. తొలుత గ్రామ, వార్డు స్థాయిల్లో ఆ తర్వాత మండల స్థాయి, నియోజకవర్గ స్థాయి, జిల్లా స్థాయి , రాష్ట్ర స్థాయిలో పోటీలు ఉంటాయన్నారు. గ్రామ, వార్డు సాయిల్లో జరిగే పోటీలకు క్రీడా సామాగ్రిని సరఫరా చేయడం జరుగుతుందన్నారు. మండల స్థాయిలో విజేతలైన వారికి ప్రత్యేక క్రీడా సామాగ్రిని బహుమతిగా అందజేస్తామన్నారు. క్రికెట్,వాలీబాల్, కబడ్డీ, కోకో పోటీల్లో నియోజకవర్గ స్థాయిలో విజేతలైన వారికి మొదటి బహుమతిగా 35 వేల రూపాయలు, రెండో బహుమతిగా 15 వేల రూపాయలు, మూడో బహుమతిగా 5 వేల రూపాయలు అందజేస్తామన్నారు. అలాగే జిల్లా స్థాయిలో మొదటి బహుమతిగా 60 వేల రూపాయలు, రెండవ బహుమతిగా 30 వేల రూపాయలు, మూడవ బహుమతిగా 10 వేల రూపాయలు ఉంటుందన్నారు. అలాగే రాష్ట్రస్థాయిలో మొదటి బహుమతిగా 5 లక్షల రూపాయలు, రెండవ బహుమతిగా 3 లక్షల రూపాయలు, మూడవ బహుమతిగా 2 లక్షల రూపాయలు అందజేయడం జరుగుతుందన్నారు. జిల్లాలోని ఆసక్తిగల క్రీడాకారులం దరూ కూడా ఆడుదాం ఆంధ్ర పోటీలలో పాల్గొనా లన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ ఝాన్సీ, మచిలీపట్నం ఆర్డిఓ శివ నారాయణ రెడ్డి పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.



బహుమతులు పొందిన విద్యార్థినీలు

కొమ్మారెడ్డి విద్యార్థులకు బహుమతులు

ప్రజాశక్తి-బంటుమిల్లి : ఈనెల 8వ తేదీన విశాఖపట్నంలో నిర్వహించిన ఇన్విటేషన్ సౌత్ ఇండియా ఛాంపియన్షిప్ 2023 లో తమ పాఠశాల విద్యార్థులు బహుమతులు సాధించారని కొమ్మారెడ్డి స్కూల్ డైరెక్టర్ కిషోర్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ సుమారు 600 మంది విద్యార్థులు వివిధ ప్రాంతాల నుండి పాల్గొన్నారని, దీనిలో తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు బహుమతులు సాధించారన్నారు. 10 సంవత్సరాల కటా విభాగంలో ఎం.మహిమ (ఐదో తరగతి) ద్వితీయ స్థానం, బి ఐశ్వర్య(ఆరో తరగతి) అర్జపూర్ణశ్రీ (నాలుగో తరగతి), సిహెచ్ అక్షయ నాగ సింధు (ఆరో తరగతి) బహుమతులు సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

పెదపారుపూడి సొసైటీ అధ్యక్షుడు రాజీనామా



ప్రజాశక్తి-పెదపారుపూడి : మండల కేంద్రమైన పెదపారుపూడి సొసైటీ అధ్యక్షుడిగా పనిచేస్తున్న తుమ్మల కోటేశ్వరరావు సోమవారం రాజీనామా చేశారు. ఈమేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 28 నెలలుగా పనిచేసే సొసైటీని ఎంతో అభివద్ధి బాటలో నడిపానని అన్నారు. కొన్ని కోట్ల రూపాయలు రైతులకు రుణాలు ఇచ్చి బ్యాంకును అభివృద్ధి చేశానన్నారు. మరొకరికి అవకాశం కల్పించేందుకు రాజీనామా చేశానని ఆయన తెలిపారు .

అభివృద్ధిబాటలో వానపాముల : సర్పంచ్



ప్రజాశక్తి-పెదపారుపూడి : గ్రామాన్ని అభివృద్ధిబాటలో నడిపిస్తున్నట్లు మండలంలోని వానపాముల గ్రామ సర్పంచ్ పాతూరి రమేష్ అన్నారు. సర్పంచ్‌గా బాధ్యతలు స్వీకరించి రెండున్నర సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ పామర్రు శాసనసభ్యులకు కైలా అనిల్ కుమార్ గ్రామాభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారన్నారు. గ్రామంలో 17 లక్షలతో సిమెంట్ రోడ్డు నిర్మాణం, మూడు లక్షలతో డ్రైనేజీ కొత్తగా తూములు, గ్రామంలో 30 బెంచీలు, కొత్తగా 10 వీధి దీపాలు, గ్రామంలో గ్రావెల్ రోడ్డు నిర్మాణం, జలకల నిధులతో ఇంటింటి కొళాయిలు నిర్మించినట్లు తెలిపారు. మరో రెండు సిమెంట్ రోడ్లు నిర్మాణానికి ప్రణాళిక తయారు చేసినట్లు సర్పంచి తెలిపారు.

కాన్షీరామ్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి మచిలీపట్నంరూరల్ : బహుజన సమాజ్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు కాన్షీరామ్ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు అర్పించారు. సోమవారం మచిలీపట్నంలోని స్థానిక డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ సర్కిల్‌లో కాన్షిరామ్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పెగ్గెం ప్రసాదరావు, నియోజకవర్గ అధ్యక్షులు సౌడాడ బాలాజీ, నగర అధ్యక్షుడు కాండ్రు చిన్నా పాల్గొన్నారు. **గుడివాడ :** కాన్షీరామ్ 17వ వర్ధంతిని బిఎస్‌పి ఆద్వర్యంలో గుడివాడలో ఘనంగా నిర్వహించారు. సోమవారం స్థానిక కోతిబోమ్మ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద కన్షీరామ్ 17వ వర్ధంతి సందర్భంగా అయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళ్ళు అర్పించారు. ఈ కార్యక్రమంలోబిఎస్‌పి జిల్లా అధ్యక్షుడు ప్రసాద్, జిల్లా ఇన్‌చార్జి బోసు, నియోజకవర్గం ఇన్‌చార్జి దారం కరుణాకర్, నియోజవర్గ అధ్యక్షులు ఎం.మరియబాబులు, బిఎస్‌పి నాయకులు బాబురావు, గురవయ్య, జయరాజు పాల్గొన్నారు.





సిపిఎం ఆధ్వర్యాన జగ్గయ్యపేట, నందిగామల్లో ధర్నా చేస్తున్న దృశ్యాలు

'గ్రీన్‌టెక్'ను తరలించండి

(మొదటి పేజీ తరువాయి)

యాత్రను సిపిఎం సీనియర్ నాయకులు, ప్రముఖ న్యాయవాది కాసరగడ్డ నాగేశ్వరరావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డివి కష్ణ మాట్లాడుతూ గ్రీన్‌టెక్ ఫ్యాక్టరీ షేర్ మహమ్మద్‌పేట, రామచంద్రునిపేట, అనుమంచి పల్లి గ్రామాల ప్రజల ఆరోగ్యాన్ని తీవ్రంగా దెబ్బతీస్తోందన్నారు. పొలాలకు వచ్చే కూలీలు సైతం దుర్గంధం భరించలేక పనులకు రావడంలేదన్నారు. పశువులు చనిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అనేక మంది ప్రజలు కిడ్నీ, కేన్సర్ వంటి వ్యాధుల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఫ్యాక్టరీ నిర్మాణానికి ఎటువంటి అనుమతులూ లేవని, ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించలేదని, కొంతమంది రాజకీయ నాయకుల అండతో మాత్రమే ఈ ఫ్యాక్టరీని ఏర్పాటు చేశారని విమర్శించారు. రాష్ట్రంలో గల వివిధ కెమికల్ ఫ్యాక్టరీలలోని వ్యర్థాలను ఇక్కడికి తీసుకువచ్చి నిల్వ ఉంచుతున్నారని, ఆ తర్వాత ప్యూరిఫైడ్ చేస్తున్నారని, దీని ఫలితంగా ఈ పరిసర ప్రాంతాల ప్రజలకు కాలుష్యం బారిన పడుతున్నారని అన్నారు. భూగర్భ జలాలు సైతం కలుషితమై పంటలు దెబ్బతింటున్నాయన్నారు. ఫ్యాక్టరీ సమీపంలో గల జిల్లాపరిషత్ పాఠశాలలో 500 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని, ఈ ఫ్యాక్టరీ నుండి వచ్చిన కాలుష్యంతో ఇటీవల కాలంలో ఐదుగురు విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని గుర్తుచేశారు. గ్రీన్‌టెక్ ఫ్యాక్టరీ సమస్యపై మూడేళ్లుగా సిపిఎంతోపాటు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో అనేక రూపాల్లో ఆందోళనలు నిర్వహించి స్థానిక శాసనసభ్యులు, కలెక్టర్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అధికారులకు ఎన్నోసార్లు వినతిపత్రాలు సమర్పించామని తెలిపారు. సిపిఎం జగ్గయ్యపేట పట్టణ, మండల కార్యదర్శి ఎస్.నాగమణి మాట్లాడుతూ మండల పరిధిలో పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న కాలుష్యం వెదజల్లే కెమికల్ ఫ్యాక్టరీలను మూసివేయాలని డిమాండ్ చేశారు. బైక్ యాత్రకు జిల్లా పరిషత్ పాఠశాల వద్ద విద్యార్థులు సంఘీభావం తెలిపి మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎన్.సిహెచ్.శ్రీనివాస్, సీనియర్ నాయకులు చిరుమామిళ్ల హనుమంతరావు, కాకనబోయిన లింగారావు, కోట కష్ణ, దంతాల వెంకటేశ్వర్లు, చనుమోలు సైదులు, నాయకులు షేక్ గౌస్‌మియా, జె.వెంకటరావు, కోట రవికుమార్, దంతాల రాజేశ్వరి, కోటేశ్వరి, కాకనబోయిన వెంకటేశ్వరరావు, రావేళ్ల శేషు, రాంప్రసాద్, కె శ్రీనివాసరావు, మీరా సాహెబ్, రామనాథం, రామనాథం, వెంకటేశ్వర్లు, కర్రి వెంకటేశ్వరరావు, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు గోపీ నాయక్, ఎస్. ప్రణయ్ తేజ, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

చర్యలు తీసుకుంటాం : ఆర్‌డిఒ

వినతిపత్రం అందుకున్న ఆర్‌డిఒ రవీంద్ర రావు మాట్లాడుతూ గ్రీన్‌టెక్ ఫ్యాక్టరీపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా ఫ్యాక్టరీ నడుపుతున్నట్లయితే మూసి వేయటానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

మంచి పేరెంటింగ్ ముఖ్యం

(మొదటి పేజీ తరువాయి)

చెప్పడంతోపాటు చక్కటి అలవాట్లను కూడా నేర్పించాలన్నారు. ఇండ్లాస్ చైల్డ్ గైడెన్స్ క్లినిక్స్ డైరెక్టర్ డాక్టర్ విశాల్ మాట్లాడుతూ పిల్లల పెంపకంపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. అతి కఠినంగానూ, అతిగారాబంగానూ పెంచడం మంచిదికాదన్నారు. పిల్లల మాటలకు విలువ ఇస్తూనే, మంచీ చెడు వారికి తెలియచేయాలన్నారు. సెల్‌ఫోన్లు, ట్యాబ్లను మితంగా వాడేవిధంగా చూడాలని, వాటిలో వారు ఏమి చూస్తున్నారో గమనించాలని అన్నారు. పిల్లలతో సమయం గడపడం చాలా ముఖ్యమన్నారు. కనీసం రోజులో ఒకసారైనా పిల్లలతో కలిసి భోజనం చేసి వారి మంచీ చెడు తెలుసుకోవాలన్నారు. తల్లిదండ్రుల కోర్కెలను పిల్లలపై రుద్దకుండా వారి అభిరుచి, సామర్థ్యాన్ని ఆధారంగా వారికి ఇష్టమైన రంగంలో ఎదిగేందుకు ప్రోత్సహించాలన్నారు.

ఇండ్లాస్ హాస్పటల్స్ చైర్మన్ డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ మానసిక వైద్యంలో ఇటీవల వచ్చిన అధునాతన చికిత్సా పద్ధతులను వివరించారు. ఐఎంఎ సభ్యులు డాక్టర్ రెహమాన్, డాక్టర్ దుర్గారాణి, విజయవాడ సైకియాట్రిక్ సొసైటీ అధ్యక్షులు డాక్టర్ నవీన్ పాల్గొన్నారు.

పేరు మార్పు కోసం

సంకే రమ్య 34 సంవత్సరాలు సంకే చంద్రమోహన్ వివాహం కాకముందు తమ్ము రాఘవమ్మగా నమోదు అయిఉన్నది వివాహం అనంతరం నా పేరు సంకే రమ్యగా అన్ని రికార్డుల్లో నమోదు అయి ఉన్నది సంకే రమ్య గా పేరు మార్పు చేసుకున్నాను అని తెలియజేయుచున్నాను.

సంకే రమ్య రామాపురం
చిన్న పాంద్రాక కృత్తివెన్ను మండలం

IN THE COURT OF THE HON□BLE XIII ADDL. DIST. JUDGE AT VIJAYAWADA
I.A. No. 90/2023 in O.S. No. 43/2014

Between :
Joseph Jyothsna Christiana
rep by her GPA J.M.Thyagaraj
... Petitioner / Plaintiff
AND
Bhavanipuram Ravi Kiran And others
... Respondents / Defendants

Notice To
1) Bhavanipuram Rajasekhar S/o Suryaprakash Rao. R/o Flat No. 304, Kaleswararao Road, Suryaraopet, Vijayawada-2. . . .. **Respondent No.2**
2) The Municipal Teacher Education Society, rep by its Secretary, Pamidipati Rama Koteswara Rao, S/o Venkata Subbayya, R/o D.No. 20-6-68/A, Mahalakshmi Nilayam, 2nd Lane, Ramalingeswarapet, Vijayawada.
... Respondent No.3

పై నెంబరు పిటీషన్‌లో పైన పేర్కొన్న నెం. 2, 3 ప్రతివాదుల హాజరు నిమిత్తం కోర్టువారు నోటీసు ఆర్డరు చేసియున్నారు. కావున సదరు నెం. 2, 3 ప్రతివాదులు 16-10-2023వ తేదీన ఉదయం 10-30 గం.లకు కోర్టువారి యెదుట స్వయంగా లేదా వకీలుగారి ద్వారా హాజరయి సంజాయిషీ ఇచ్చుకోవలయును. లేనియెడల సదరు పిటీషను మీ పరోక్షములో తీర్మానించబడును.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)

వాయిదా : 16-10-2023

ఇట్లు
కె.వి.భానుమూర్తి,
అడ్వకేట్,
సెల్ : 9866001022.

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE :: AT SATTUPALLI
O.S. No. 470 of 2015

Between :
Andhra Bank (UBI), Madhira Branch, Rep. by its Branch Manager ... Plaintiff
And
Nalajala Narender and others..Defendants

NOTICE

To,
Nalajala Narendar S/o Mohan Rao, R/o Thalluru Village, Vasthavai Mandal, NTR District.

The plaintiff herein had filed the above suit against you before this Hon□ble court for recovery of money, the above case is posted to 12-10-2023 for your appearance. For suit notice along with interiocutory applications. That you are hreby require to be attend either in person or through an advocate on 12-10-2023 at 10.30 AM before this Hon□ble court. Otherwise the matter will be heard and decided ex-parte/as per procedure.

(By order of the Hon□ble court)

K.PANDU RANGA RAO,
Advocate, Khammam

PUBLIC NOTICE

The General Public is hereby informed that my client entered into an agreement of sale on 05-10-2023, for the below mentioned property form its owner. J.Subba Rao S/o Hanumanth Rao, Door No. 2-11-133, Ibrahimpatnam, Ferry Road, NTR(Dt), Andhra Pradesh-521456

SCHEDULE OF PROPERTY

All that part and parcel of Door No. 2-11-133, R.C.C. building ad measuring 171.11 sq yards in survey No.220/2A1 in Ibrahimpatnam Village, Under Kondapalli Municipality, Ibrahimpatnam Mandal, NTR District, Andhra Pradesh State.

Any Person/Persons having any right, interest, claim or demand whatsoever on respect of the said building way of sale, exchange, Mortgage, Gift, inheritance, bequest, possession, Lease, Lincense, Tenancy, Lien, Change, Maintanance, Easement, or Under any agreement of sale or power of attorney, whatsoever or otherwise howsoever is hereby required to make the same in writing with documentary proof there to the undersigned at the address mentioned below with in 7(seven) days from the date hereof, falling which the sale deed shall be excuted without any reference to such claim, demand right or interest whatsoever and the same shall be deemed to be waived to all intents and purposes.

B.VenkataRao, Advocate,
H.No.5-7/4-19, K.L.Rao Nagar 4th Line,
Chitti Nagar, Vijayawada,
N.T.R District, Andhra Pradesh-520001
Email id:badisa.1984@gamil.com,
Cell No.9290627070

మహారాజ శ్రీ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, రాజాం వారి సముఖమునకు
IA NO: 117 /2023 in AS.10/2019

Between :
జక్కంపూడి రమణ వగైరాలు ....పిటీషనర్లు /వాదులు
And
బట్ట సన్యాసి (మరణం) వగైరాలు
...రెస్పాండెంట్స్ /ప్రతివాదులు

To
R2 బట్ట సత్యవతి భర్త లేటు సన్యాసి వ.58సం.లు, నేతాజీ స్కూల్ దగ్గర,భవానీపురం విజయవాడ.
R3 బట్ట పార్వతీశం S/o లేటు సన్యాసి వ.48 సం.లు.
R4 బట్ట గడ్డయ్య S/o సన్యాసి, 38సం.లు, Rest -do-
R5 బట్ట శంకరరావు S/o సన్యాసి, 35 సం.లు, Rest -do-
R6 అల్లాడ పార్వతి S/o చండేశ్వరరావు @ చండి, 45 సం.లు. Rest -do-
R7 బట్ట ఈశ్వరమ్మ S/o సత్యవతి 32 సం.లు, Rest -do-
R8 బట్ట గౌరమ్మ D/o సత్యవతి, 30 సం.లు, Rest -do-

పై నెంబరు గల అప్పీల్ యందు మొదట ప్రతివాది కాలం చేసినందున సదరు 2 నుండి 8 ఆసాములు మొదటి ప్రతివాదికి వారసులుగా మిమ్మల్ని చేర్పించమని కోరుచూ పిటిషనర్ పిటిషన్‌ను దాఖలు చేయగా పై కోర్టు వారి ఆర్డర్ ప్రకారం మీకు పలు పర్యాయములు కోర్టు ద్వారా రిజిస్ట్రరీ పోస్ట్ ద్వారా నోటీసులు పంపించినప్పటికీ అమలు జరగనందున ఇందు విషయమై మీకు ఆక్షేపణలు ఉన్నయెడల తే : 30.10.2023ది న ఉదయం : 10.30 గం. లకు మీరు స్వయంగా గాని, లేదా వకీలు గారు ద్వారా పై శ్రీ కోర్టువారి ఎదుట హాజరై తెలియజేసుకోవలెను, లేని యెడల మీపరోక్షంన తీర్మానించుదురు.

రాజాం
తేది:09.10.2023

K. కృష్ణారావు
పిటీషనర్ తరపు న్యాయవాది
సెల్ : 9652530693

IN THE COURT OF THE HON'BLE MACT CHAIRMAN-CUM-XXVI ADDL CHIEF JUDGE, CITY CIVIL COURT AT: HYDERABAD
MVOP 1463 OF 2021

Between:
P.Alivelu ... Petitioner
And
T.Ravi Teja and others ... Respondents

To,
Kola Nagaraju S/o Adinarayana, Age:Major, Occ: Driver of Crime Vehicle, R/o: Salempelem, Avanigadda Mandal, Krishna Dist, AP-521121 -R3

NOTICE

Please take notice that the above MVOP No.1463 of 2021 is filed against you and others for grant of compensation and the above case is posted for your appearance on **31-10-2023 at 10.30**a.m. in person or by an advocate, failing which the case will be decided on merits in your absence.

BY ORDER OF THE COURT

T. SHYAM SUNDER
Advocate,
Plot No.7,Phase-IV
Vanasthalipuram,
Hyderabad-500070
Cell-9704770735

IN THE COURT OF THE III ADDITIONAL SENIOR CIVIL JUDGE, AT VIJAYAWADA
E.P. No. 128/2022 in O.S. No. 17/2016

Between :
Yerrapothu Mutyalu, Rep by GPA Holder Y.Naga Raju ... DHR
Vs
Sandipamu Joseph & Others ... JDRs
JDR No.3 : Sandipamu Sarojini, D/o S.Joseph,
JDR No.4 : Sandipamu Vijaya Kumar, S/o Joseph
JDR No.6 : Sandipamu Ajay Kumar, S/o Joseph,
JDR No. 3, 4 & 6 are residing at D.No. 5-165B, Gollapudi, Vijayawada Rural.

పై నెంబరులోని డిక్రీహోల్డరు గారు Schedule Property ని Valate చేయమని మరియు స్వాధీనం చేయమని శ్రీ కోర్టువారి యెదుట JDR No. 3, 4, 5 మరియు 6 వారల పైన పిటీషను దాఖలు పరిచినారు. సదరు JDR No. 3, 4 మరియు 6 వారలయిన Sandipamu Sarojini, D/o S.Joseph, JDR No.4 : Sandipamu Vijaya Kumar S/o S.joseph, JDR No.6 Sandipamu Ajay Kumar, D.No. 5-165B, Gollapudi Vijayawada వారు శ్రీ కోర్టువరి నోటీసులు అందుకొనక జాప్యం చేయుచున్నారు. సదరు JDR No. 3, 4 & 6 వారల హాజరు నిమిత్తం శ్రీ కోర్టువారు తేది 11-10-2023న వాయిదా వేసినారు. కావున JDR No. 3, 4 & 6 వారలు 11-10-2023వ తేదీ ఉదయం 10-30 గం.లకు శ్రీ కోర్టువారి యెదుట స్వయంగా గానీ, ప్లీడరుగారి ద్వారా గానీ హాజరు కావలెను. అట్లు హాజరు కాని యెడల శ్రీ కోర్టువారు వారి పరోక్షమున తీర్మానించెదరు.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వులతో ప్రకటించడమైనది)

వాయిదా : 11-10-2023
ఉదయం 10-30 గం.లకు

ఇట్లు
శ్రీ ఆర్.వి.రామకృష్ణ,
జె.దిలీప్‌కుమార్,
అడ్వకేట్స్, విజయవాడ-2.
సెల్ : 94401 75910.

గ్రామపంచాయతీ కార్యాలయము, కోర్నిపాడు

వేలము ప్రకటన

ఆర్.ఓ.సి. నెం. /2023 — తేది : 9-10-2023

కృష్ణాజిల్లా, పెదపారుపూడి మండలం, కోర్నిపాడు గ్రామపంచాయతీ ఏరియాలో గల ఈ దిగువ చెరువులో చేపలు పట్టుకొనుటకు గాను ది.17-10-29023వ తేదీన మంగళవారం మధ్యాహ్నం గం.2-00 లకు కోర్నిపాడు గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద శ్రీ విస్తరణాధికారి (పం.రా., గ్రా.అ.) పెదపారుపూడి వారి సమక్షంలో గాని వారి అనుమతి పొందిన వారి సమక్షంలో గాని బహిరంగ వేలం పాటలు జరుపబడును. సదరు వేలంపాటల యందు పాల్గొనదలచిన వారు ఈ దిగువ నుదహరించిన విధంగా ధరావత్తులు చెల్లించి వేలంపాటల యందు పాల్గొనవలెను. మిగిలిన వివరములు కార్యాలయము పనిచేయు వేళల యందు తెలుసుకొనవచ్చును.

వ.నెం.	చెరువు వివరము	పాట కాలము	చెల్లించవలసిన ధరావత్తు
1.	ఊర చెరువు	2023-24 సం॥ (ఒక సంవత్సర కాలము)	రూ.20,000/-లు
2.	దనియాల గుంట చెరువు	- డు -	రూ.10,000/-లు

సం/- దూడల లోకేశ్వరి
సర్పంచ్,
గ్రామపంచాయతీ, కోర్నిపాడు

సం/- ఎన్.సాంబశివరావు
పంచాయతీ కార్యదర్శి,
గ్రామపంచాయతీ, కోర్నిపాడు

గ్రామపంచాయతీ కార్యాలయము, వానపాముల

వేలము ప్రకటన

ఆర్.ఓ.సి. నెం. 4 /2023 — తేది : 9-10-2023

కృష్ణాజిల్లా, పెదపారుపూడి మండలం, వానపాముల గ్రామపంచాయతీ ఏరియాలో గల ఈ దిగువ చెరువులో చేపలు పట్టుకొనుటకు గాను ది.16-10-29023వ తేదీన సోమవారం మధ్యాహ్నం గం.2-00 లకు వానపాముల గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద శ్రీ విస్తరణాధికారి (పం.రా., గ్రా.అ.) పెదపారుపూడి వారి సమక్షంలో గాని వారి అనుమతి పొందిన వారి సమక్షంలో గాని బహిరంగ వేలం పాటలు జరుపబడును. సదరు వేలంపాటల యందు పాల్గొనదలచిన వారు ఈ దిగువ నుదహరించిన విధంగా ధరావత్తులు చెల్లించి వేలంపాటల యందు పాల్గొనవలెను. మిగిలిన వివరములు కార్యాలయము పనిచేయు వేళల యందు తెలుసుకొనవచ్చును.

వ.నెం.	చెరువు వివరము	పాట కాలము	చెల్లించవలసిన ధరావత్తు
1.	ఊర చెరువు	2023-24 సం॥ నుండి 2025-26 సం॥ వరకు (మూడు సంవత్సరాల కాలము)	రూ.50,000/-లు
2.	రజక చెరువు	- డు -	రూ.5,000/-లు

సం/- పాతూరి రమేష్
సర్పంచ్,
గ్రామపంచాయతీ, వానపాముల

సం/- ఎన్.సాంబశివరావు
పంచాయతీ కార్యదర్శి,
గ్రామపంచాయతీ, వానపాముల

అట్రాసిటీ కేసుల్లో బాధితులకు సత్వర న్యాయం

- కృష్ణా జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల సత్వర పరిష్కారం, సత్వర న్యాయం, బాధితులకు పరిహారం అందించడంలో పోలీసు అధికారులు ప్రో యాక్టివ్ గా స్పందించాలని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు సూచించారు. ఎస్సీ, ఎస్టీ (ప్రివెన్షన్ ఆఫ్ అట్రాసిటీస్) యాక్ట్ అమలకు సంబంధించి డిస్ట్రిక్ట్ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం సోమవారం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన కలెక్టరేట్లో స్పందన మీటింగ్ హాల్లో నిర్వహించి జిల్లాలో ఎస్సీ, ఎస్టీలపై అట్రాసిటీ కేసుల పెండింగ్, బాధితులకు పరిహారం అందించే అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల నివారణ సంబంధించి జిల్లాలో మహిళలు, బాలికలపై లైంగిక వేధింపులు, మానభంగాలు ఎక్కువగా నమోదవుతున్న పోలీస్ సబ్ డివిజన్లలో హాట్ స్పాట్లు గుర్తించి, ఎక్కువగా అప్రమత్తంగా ఉండాలని, వాటి నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులకు సంబంధించి ఈ ఏడాది జనవరి నుండి సెప్టెంబర్ వరకు 102 కేసులకు సంబంధించి 115 మంది ఎస్సీ ఎస్టీ బాధితులకు పరిహారం రు.1.01 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. జిల్లా ఎస్పి పి జాషువా మాట్లాడుతూ దిశ చట్టం అమలు పోలీస్ అధికారులు జిల్లాలో పాఠశాలలు బాలికల హాస్టళ్లలో విస్తతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఎర్లీ ఏజ్ లో ప్రేమ వ్యవహారాలపై కౌన్సిలింగ్, అవగాహన నిర్వహించాలన్నారు. జిల్లాలో ప్రతి పోలీస్ స్టేషన్లో సిటిజన్ చార్టర్ తో పాటు ఎస్సీ ఎస్టీ (ప్రివెన్షన్ ఆఫ్ అట్రాసిటీ) యాక్ట్, ఏసీబీ చట్టం నిబంధనలతో బోర్డులు ప్రదర్శించాలని, సామాన్య ప్రజలకు తగిన అవగాహన కల్పించాలని ఎస్పి పోలీస్ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో పాల్గొన్న పామర్రు శాసనసభ్యులు అనిల్ కుమార్ మాట్లాడుతూ సమాజంలో అట్టడుగు వర్గాలు బలహీన వర్గాల వారికి న్యాయం జరిగేలా చూడాలని అన్నారు. సమ సమాజ స్థాపన జరగాలని ముఖ్యమంత్రి ఉద్దేశ్యం అన్నారు. ఈ దిశగా ప్రభుత్వం కషి చేస్తుందన్నారు. ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసుల సత్వర పరిష్కారంతోపాటు బాధితులకు న్యాయం జరిగేలా పోలీస్ అధికారులు కషి చేయాలన్నారు. ఈ సమావేశంలో ఏ ఎస్ పి శ్రీ హరి బాబు, కమిటీ కన్వీనర్ సాంఘిక సంక్షేమ శాఖ డిడి షాహిద్ బాబు షేక్, జిల్లాలో పోలీస్ సబ్ డివిజనల్, దిశా అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ పి.రాజాబాబు



15న వెంపటి చినసత్యం జయంతి వేడుకలు

ప్రజాశక్తి - మొవ్వ : నాలుగవ ప్రపంచ కూచిపూడి దినోత్సవం సందర్భంగా ఈనెల 15న కూచిపూడి నాట్య కళా పీఠంలో డాక్టర్ వెంపటి చినసత్యం జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించునట్లు సాంస్కతిక శాఖ సంచాల కులు ఆర్. మల్లికార్జునరావు తెలిపారు. సోమవారం కళాపీఠంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర భాష సాంస్కతిక శాఖ ఆధ్వర్యంలో సేవ్ కూచిపూడి ఆర్టిస్ట్స్, జయహెూ భారతీయంల సంయుక్త నిర్వహణలో నిర్వహించే వేడుకలకు రాష్ట్ర సాంస్కతిక పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా, గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్, తదితరులు హాజరవుతారని చెప్పారు. ఈసందర్భంగా ఆయన శ్రీ సిద్ధేంద్ర యోగి కూచిపూడి నాట్య కళా పీఠ ప్రాంగణం, పద్మభూషణ్ డాక్టర్ చినసత్యం ఇంటి ప్రాంగణాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వెంపటిచినసత్యం లైఫ్ అచీవ్ మెంట్ ద్వారా ఐదు లక్షల రూపాయలను ఎంపిక చేసిన నాచా ర్యులకు ప్రభుత్వం అందజేస్తుందని సేవ్ కూచిపూడి ఆర్టిస్ట్ నిర్వాహకురాలు భావన పెదప్రోలు తెలిపారు. కళా పీఠం ప్రిన్సిపాల్ డాక్టర్ వేదాంతం రామలింగ శాస్త్రి, సాంస్కతిక శాఖ మంత్రి ఓఎస్డి రాజారావు, నాట్యా చార్యులు డాక్టర్ చింతా రవి బాలకష్ణ పాల్గొన్నారు.

మోకాళ్లపై నిలబడి నిరసన

ప్రజాశక్తి-అవనిగడ్డ : టిడిపి జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అరెస్టుకు నిరసనగా మాజీ ఉప సభాపతి మండలి బుద్ధ ప్రసాద్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు 27వ రోజుకు చేరుకున్నాయి. సోమవారం దీక్షలో కోడూరు మండలం జయపురం గ్రామానికి చెందిన గ్రామ సర్పంచ్ పాలడుగు భార్గవి ఆధ్వర్యంలో మహిళలు దీక్షలో పాల్గొన్నారు. తెలుగు మహిళ నియోజకవర్గ అధ్యక్షురాలు బండే కనకదుర్గ, మోపిదేవి ఎంపీపీ రావి దుర్గావాణి, బొబ్బర్లంక సర్పంచ్ దోప్పలపూడి గంగాభవాని, మార్ల జయలక్ష్మి, కుక్కిలిగడ్డ మాధవి, మద్దాల శ్రావణి, యాసం లంకమ్మ. సనక అన్నపూర్ణమ్మలు దీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళలు మోకాళ్లపై నిలబడి నిరసన తెలియజేశారు. దీక్ష కార్యక్రమాన్ని జనసేన పార్టీ నాయకులు మట్టి వెంకటేశ్వరరావు గుడివాక శేషుబాబు తదితరులు పాల్గొని సంఘీభావం తెలిపారు. అనంతరం దీక్షలను పైడిపాముల కష్ణకుమారి బండి కనకదుర్గ దివి యుగంధరి గుడివాక శేషుబాబు దీక్షలో పాల్గొన్న వారికి నిమ్మరసం ఇచ్చి దీక్షలను విరమింప చేశారు. దీక్షలకు పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరు వెంకటేశ్వరరావు, తుమ్మల చౌదరి బాబు, రావి నాగేశ్వరరావు, యా సం చిట్టిబాబు, మెండు లక్ష్మణరావు, బం డే రాఘవ తదితరులు పాల్గొని సంఘీభావం తెలిపారు. కాగా దీక్షలను సోమవారంతో ముగిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. **ప్రజాశక్తి-పెదపారుపూడి** : ప్రజాస్వామ్యబద్ధంగా పాలన సాగించిన చంద్ర బాబును న్యాయమే కాపాడుకుంటుందని తెలుగుదేశం పార్టీ పామర్రు ఇంచార్జ్ వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు. పెదపారుపూడి మండలం లో వెంట్రప్రగడ గ్రామం శివారు పులవర్తి గుడి సోమవారం భవిష్యత్తు బాబుతో గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. వర్ల కుమార్ రాజా మాట్లాడుతూ జగన్ రెడ్డి ఎన్ని తప్పుడు కేసులు పెట్టినా చంద్రబాబు నాయుడు కడిగిన ముత్యంలా బయటకు వస్తారన్నారు. ఈ కార్యక్రమం లో టిడిపి మండల అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి (చంటి), గొర్రెపర్తి రవికుమార్, మాయల విజయబాబు, కలపాల కిషోర్ పాల్గొన్నారు. **ప్రజాశక్తి-తోట్లవల్లూరు** చంద్రబాబు నాయుడును అక్రమంగా కక్షపూరితంగా వైసిపి ప్రభుత్వం అరెస్టు చేసిందని మాజీ ఎంపీ కొనకళ్ళ నారాయణ అన్నారు. సోమవారం వల్లూరు పాలెం గ్రామంలో టిడిపి సీనియర్ నాయకులు చింతపల్లి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా నిర్వహించిన రిలే నిరాహార దీక్షకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన కొనకళ్ల నారాయణ మాట్లాడారు. పామర్రు నియోజకవర్గ స్థాయిలో ఎస్సీ విభాగం తరపున ఏర్పాటు చేసిన ఈ రిలే నిరాహారదీక్షకి నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొని మద్దతు తెలిపారు. నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి వర్ల కుమార్ రాజా, మండల టిడిపి అధ్యక్షులు వీరపనేని శివరాం ప్రసాద్, వీరంకి వెంకట గురుమూర్తి, ఆదినారాయణ, కొనకాల వాసు, ఈడే వాసు, ఏమి నేని వెంకటేశ్వరరావు నియోజకవర్గంలోని వివిధ గ్రామాల ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



అవనిగడ్డలో మోకాళ్లపై నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

కృష్ణానదిలో ఈతకు వెళ్లి యువకుడు మృతి



ప్రజాశక్తి-తోట్లవల్లూరు : మండలంలోని వల్లూరు పాలెం గ్రామంలో ఈతకు వెళ్లి కృష్ణా నదిలో మునిగి యువకుడు మతి చెందిన ఘటన సోమవారం గ్రామంలో విషాదం నింపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వల్లూరు పాలెం గ్రామం నుంచి సరదాగా ముగ్గురు యువకులు కృష్ణా నదిలో ఈతకు వెళ్లారు. వీరిలో షేక్ నాగుల్ మీరా(20) అదుపుతప్పి మధ్యాహ్నం మూడు గంటల సమయంలో కృష్ణా నది గుండంలోకి జారిపోయి మునిగి గల్లంతయ్యాడు. సమా చారం అందుకున్న పోలీసులు గజ ఈతగాళ్ల తో గాలించగా సాయంత్రం ఐదున్నర గంటల సమయంలో మృతదేహం లభ్యమయింది. తండ్రి షేక్ బాజీ, తల్లి నాగూర్ బి లు విగత జీవిగా పడి ఉన్న తమ కుమారుని చూసి కన్నీరు మున్నీరయ్యారు. సంఘటన స్థలాన్ని పరిశీలించిన ఎస్సై విశ్వనాథ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.



సభలో అధికారులను ప్రశ్నిస్తున్న గ్రామస్తులు

ఉపాధి హామీ గ్రామసభ

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ : మచిలీపట్నం మండలం పెదపట్నం గ్రామంలో సర్పంచ్ అనూష అధ్యక్షతన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం అమలులో సామూహిక తనిఖీ గ్రామ సభ సోమవారం నిర్వహిం చడం జరిగింది. ఈ సందర్భంగా అనూష మాట్లాడుతూ గ్రామంలో గత సంవత్సరం చేపట్టిన పనులను భవిష్యత్తులో చేయబోయే పనులను గ్రామస్తుల దగ్గర్నుంచి ప్రజా అభిప్రాయ సేకరణ ద్వారా స్వీకరించి ఈ పనులను ఈ సంవత్సరంలో మొదలు పెట్టాలని ఉపాధి హామీ అధికారులకు తెలియజేశారు. మహాత్మా గాంధీ ఉపాధి హామీ సామూహిక తనిఖీ అధికారి మాట్లాడుతూ గత సంవత్సరంలో గ్రామ పంచాయతీ లో 38 లక్షల రూపాయలు పనులు జరిగాయని వీటికి సంబంధించి గ్రామస్తులకు చదివి వినిపించారు. అలాగే ఉపాధి పనులకు సంబంధించి రికార్డులను ఆడిట్ చేశామని తెలియజేశారు. ఉపాధి పని ద్వారా చేసిన డబ్బులను జమ చేసిన విధానాన్ని గ్రామస్తుల నుండి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యనిర్వహణ అధికారి జానకి, ఉపాధి హామీ సూపర్ వైజర్ ప్రసాద్ ,ఫీల్డ్ అసిస్టెంట్ పురుషోత్తం, గ్రామస్తులు ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ బీమా అందజేత

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : వడ్లమన్నాడు గ్రామ శివారు రెడ్డిపాలెం గ్రామానికి చెందిన బత్తిన వీరాంజనేయులు ఈనెల 7వ తేదీ శనివారం రాత్రి మరణించారు. వైయస్సార్ భీమా తక్షణ సహాయం క్రింద ఆయన భార్య బత్తిన ధన సువర్చన కు ,10 వేల రూపాయలు సోమవారం వ్యవసాయ సలహా మండలి సభ్యుడు పెన్నేరు ప్రభాకరరావు అందజేసినారు. ఈ కార్యక్రమంలో పాల కేంద్రం అధ్యక్షులు మోదుగుమూడి అమలేశ్వరరావ్, గ్రామస్తులు మోదుగుమూడి అర్జున్ రావు, వెల్ఫేర్ అసిస్టెంట్ ప్రియాంక, వాలంటీర్ నాగమణి, గ్రామస్తులు పాల్గొన్నారు.



పలుచోట్ల 'ఆరోగ్య సురక్ష' వైద్య పరీక్షలు



పమిడిముక్కలలో...

ప్రజాశక్తి హనుమాన్‌జంక్షన్ : దేశంలో ఎక్కడ లేని విధంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని రాష్ట్రంలో ప్రారంభించడం జరిగిందని సర్పంచ్ కమలాబాయి అన్నారు. మండల కేంద్రమైన బాపులపాడు గ్రామ పంచాయతీ లోని జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమము గ్రామ సర్పంచ్ కమలాబాయి ప్రారంభించారు. వైద్య శిబిరంలో జనరల్ ఓపి- 544 మంది, కంటి వెలుగు కింద -110 మందికి అదేవిధంగా విజయవాడ జనరల్ ఆసుపత్రికి 14 మందిని రిఫర్ చేసి వీరందరికీ పరీక్షలతో పాటు మందులు ఉచితంగా అందజేశామని డాక్టర్ మంజుష తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాటక రంగ అకాడమీ డైరెక్టర్ నక్కా గాంధీ,మాజీ జడ్పిటిసి సభ్యులు సుంకర సుభాష్ చంద్రబోస్ , ఎంపీడీవో జోగేశ్వరరావు , ఎంపీపీ యరగొర్ల నగేష్, జెడ్పిటిసి సభ్యులు కొమరవల్లి గంగాభవాని, నాయకులు కొమరవల్లి కిరణ్ మూర్తి పాల్గొన్నారు. **ప్రజాశక్తి-కోడూరు** : జగనన్న ఆరోగ్య సురక్ష ప్రజలకు రక్ష అని ఉల్లిపాలెం గ్రామ సర్పంచ్ వెర్రి పావని అన్నారు. కోడూరు మండల పరిధిలోని ఉల్లిపాలెం గ్రామంలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేట్ హాస్పటల్లో లక్షలాది రూపాయలు ఖర్చు పెట్టుకుని ప్రజలు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు సీఎం జగన్మోహన్ రెడ్డి గ్రామీణ ప్రాంతాల్లోకి వైద్యులను పంపి ఉచితంగా వైద్యసేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఆర్ శ్రీనివాస్, ఈఓ పిఆర్ డి నాగ రేవతి, పిఎసిఎస్ అధ్యక్షులు కటకం కుటుంబ రావు, పంచాయితీ కార్యదర్శి యలవర్తి సుబ్రమణ్యం పాల్గొన్నారు. **ప్రజాశక్తి-గుడ్లవల్లేరు** : మండలంలోని పెంజంద్ర గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూలు వద్ద 'జగనన్నఆరోగ్య సురక్ష' కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమమునకు ప్రజలకు వారి ఆరోగ్య సమస్యలను పరిశీలించి 438 మందికి అవసరమగు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమములో ఎంపీటీసీ సభ్యులు పోలుకొండ వైదేహి, పెంజంద్ర సర్పంచ్ రేమల్లి తాతాబాయి, ఉప సర్పంచ్ జక్కుల నాగరాజు, డాక్టర్లు పాల్గొన్నారు. **ప్రజాశక్తి ఘంటసాల** : మండల పరిధిలోని దేవరకోట గ్రామంలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో 446 మందికి వైద్యులు వైద్యసేవలు అందించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ వేమూరి వెంకట్రావు, ఎంపీడీవో కె.వి.సుబ్బారావు, తహసీల్దార్ బి.రామా నాయక్, సర్పంచ్ లు మద్దాల వెంకటేశ్వరరావు, డి.శాంతకుమారి, వైస్ ఎంపీపీ మాడెం నాగరాజు, వైద్యులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-పమిడిముక్కల** : మండలంలోని చోరగుడిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. గ్రామ సర్పంచ్ కందిమల్ల పూర్ణకుమారి, ఎండిఓ సిహెచ్ విటల్ పాల్, వీరింకిలాకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ సైరా, కపిలేశ్వరపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ మమత, తాళ్లూరి వెంకటరమణ, సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు కందిమల్ల సుబ్రహ్మణ్యం, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతి వీధీ తిరుగుతూ... సమస్యలు తెలుసుకుంటూ...

- సెంట్రల్‌లో కొనసాగిన సిపిఎం 'ప్రజాపోరు పాదయాత్ర'
- టిడ్కో గృహాలు, పట్టాల సమస్యలపై మహిళలు వినతి
- ప్రజా సమస్యలు పట్టని ఎంఎల్‌ఎ : బాబూరావు విమర్శ


మహిళల నుంచి వినతులు స్వీకరిస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాబూరావు

ప్రజాశక్తి-విజయవాడ: విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే మల్లాది విష్ణు తన సొంత మద్యం షాపులు పెట్టి, ప్రజలను మత్తులో ముంచుతూ ప్రజా సమస్యలు పట్టించుకునే పరిస్థితి లేకుండా పోయిందని, ఇదేమని ప్రశ్నించే పేదల నోరు నొక్కడం, అడిగిన వారిని అణచివేసేందుకు కేసులు పెట్టడం పరిపాటిగా మారిందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. సిపిఎం ఆధ్వర్యంలో విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో సాగుతున్న ప్రజా పోరుబాట మూడో రోజు సింగ్‌నగర్‌లోని 59వ డివిజన్‌లో సోమవారం కొనసాగింది. లెనిన్ సెంటర్, రాజ్‌గురు సెంటర్, సంజీవయ్య చౌక్, ఏకలవ్యనగర్, 19బి సుందరయ్యచౌక్ తదితర వీధులన్నీ తిరుగుతూ ప్రజా సమస్యలు తెలుసుకుంటూ సిపిఎం నాయకులు పాదయాత్ర నిర్వహించారు. టిడ్కో గృహాలకు వడ్డీకి తెచ్చి పెద్దమొత్తంలో డబ్బులు చెల్లించి ఏళ్లు కావస్తున్నా, జగనన్న ఇళ్లకు రూ.35 వేలు చొప్పున డబ్బులు చెల్లించినా ఏ ఒక్కరికీ ఇళ్లు కేటాయించలేదని, తమకు ఇంటి సదుపాయం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పరిష్కరించాలని కోరుతూ మహిళలు వినతిపత్రం అందజేశారు. దశబ్దాల తరబడి నివాసముంటున్న తమకు ఇళ్ల పట్టాలు ఇవ్వడం లేదని ఏకలవ్యనగర్‌కు చెందిన సుమారు 30 కుటుంబాల ప్రజలు వాపోయారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ 59వ డివిజన్ ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతుంటే వాటిని పరిష్కరించడానికి స్థానిక ఎమ్మెల్యేకు తీరిక లేదని, కానీ ఆయన సొంత మద్యం షాపులను పెట్టుకొని రాత్రింబవళ్లు వ్యాపారాలు చేసుకుంటారని ఎద్దేవ చేశారు. ప్రజలను ఆదుకోవాల్సిన ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులు వారిని గాలికొదిలేశారని అన్నారు. తమ దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను స్పందన కార్యక్రమం సందర్భంగా జిల్లా కలెక్టర్, నగరపాలక సంస్థ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడం జరుగుతుందని, పరిష్కరించకపోతే ప్రజల తరుపున తమ పార్టీ రాజీలేని పోరాటం చేస్తుందని అన్నారు. ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే పేదలకు ఇళ్లు ఇస్తామని ఇవ్వకుండా దగా చేశారని విమర్శించారు. ఇళ్ళు కూడా ఇవ్వకుండా కాగితాలు ఇచ్చి పేదలను నగరం నుంచి దూరంగా తరిమేసే ప్రయత్నాలు చేస్తున్నారని తీవ్రంగా మండిపడ్డారు. ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల వరకు ఉచిత కరెంట్ అని చెప్పి, ఇప్పుడు సగం మందికి ఎగనామం పెట్టారని విమర్శించారు. పెరిగిన ధరలతో ప్రజలు అల్లాడుతుంటే పట్టించుకునే దిక్కులేకుండా పోయిందని అన్నారు. కేంద్రంలోని మోడీ, రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వాలు ఆదాని, అంబానీలకు ఊడిగం చేసే ఈ ప్రభుత్వాలను సాగనంపాల్సి ఉందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఉద్యమాలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. మోడీ, జగన్ పేదలను మోసం చేశారని అన్నారు. పెద్దలకు, కార్పొరేట్లకు ఊడిగం చేసే ప్రభుత్వాలుగా మార్చేశారని పేర్కొన్నారు. పనులు లేక, ఇసుక లేక, ఆదాయాలు లేక అల్లాడుతున్నది పేదలేనని అన్నారు. మద్యం మహమ్మారి తో పేదలే కొట్టుమిట్టాడుతున్నారని, ఆరోగ్యాలు పాడు చేసుకుంటున్నారని పేర్కొన్నారు. అంబానీల కు ఊడిగం చేసే మోడీ,జగన్ల కు పేదల గురించి మాట్లాడే హక్కు లేదన్నారు.రాబోయే కాలంలో ఇటువంటి విధానాలకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాలు నిర్మించాలని అన్నారు. అసమానతలు లేని అభివద్ధి కోసం నవంబర్ 7న సిపిఎం ఆధ్వర్యంలో జరిగే భారీ బహిరంగ సభకు ప్రజలందరూ తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.శ్రీదేవి, సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి భూపతి రమణారావు, సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి వర్గ సభ్యులు కె.దుర్గారావు టి.ప్రవీణ్, కె.సరోజ, నాయకులు వై.సుబ్బారావు, ఎస్‌కె పీరు, సిహెచ్.శ్రీను, ఎం.డేవిడ్, ఎం.బాబురావు, కె.గురుమూర్తి, వెంకట్ రెడ్డి, సాంబిరెడ్డి, టి.ప్రభుదాస్, సుందర రామరాజు, నక్క సన్యాసిరావు, కె.కృష్ణ మురారి, జి.వెంకటేశ్వరరావు. ఎ.పున్నారావు, నాగార్జున, బుజ్జమ్మ, ఎస్‌కె నిజాముద్దీన్, ఎంఎన్ పాత్రులు తదితరులు పాల్గొన్నారు.

నేడు 1, 29వ డివిజన్లలో...

మంగళవారం ప్రజా పోరుబాట పాదయాత్ర కార్యక్రమం సెంట్రల్ నియోజకవర్గంలోని 29వ డివిజన్ (మధురానగర్), సాయంత్రం 1వ డివిజన్ (గుణదల)లో జరుగుతుందని నేతలు వెల్లడించారు. ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

15 నుంచి జూనియర్ సాఫ్ట్ టెన్నిస్ జాతీయ పోటీలు

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: విజయవాడ నగరంలోని ఇందిరా గాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియంలో 18వ జూనియర్ నేషనల్ సాఫ్ట్ టెన్నిస్ ఛాంపియన్ షిప్‌ను అక్టోబర్ 15 నుండి 19 వరకు నిర్వహించనున్నారు. ఈ టోర్నమెంట్‌లో దాదాపు 20 రాష్ట్ర జట్లు పాల్గొంటాయి. 15న సాఫ్ట్ టెన్నిస్ జూనియర్ నేషనల్స్‌ను పర్యాటక, సాంస్కృతిక, యువజనాభివద్ధి శాఖ మంత్రి ఆర్‌కె రోజా ప్రారంభిస్తారని ఆంధ్రప్రదేశ్ సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు వి శ్రీనుబాబు, ప్రధాన కార్యదర్శి డి దిలీప్ కుమార్ తెలిపారు. సోమవారం ఎపి సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనుబాబు, ప్రధాన కార్యదర్శి దిలీప్ కుమార్ విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర విభజన తర్వాత తొలిసారిగా తమ సంఘం జూనియర్ నేషనల్స్‌కు ఆతిథ్యం ఇస్తున్నట్లు తెలిపారు. ఈ టోర్నీలో 400 మంది క్రీడాకారులు, 100 మంది సాంకేతిక అధికారులు పాల్గోనున్నట్లు చెప్పారు. ఈ టోర్నమెంట్‌లో జూనియర్ బాలుర, బాలికల టీమ్ ఈవెంట్‌లు, సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ మ్యాచ్‌లు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. ఈ టోర్నమెంట్‌కు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, ఎన్టీఆర్ డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ సహాయాన్ని అందజేస్తున్నాయని చెపాపరు. ఫ్లడ్‌లైట్ల వెలుగులో సాఫ్ట్ టెన్నిస్ మ్యాచ్‌లు నిర్వహిస్తామని వారు తెలిపారు. ప్రారంభ వేడుకలకు సాఫ్ట్ టెన్నిస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు, ఎమ్మెల్యే మహేశ్ కస్వాల, విజయవాడ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఎమ్మెల్యేలు వెల్లంపల్లి శ్రీనివాస్, మల్లాది విష్ణు, దేవినేని అవినాష్ తదితరులు హాజరవుతారని వారు తెలిపారు.


మాట్లాడుతున్న జాకబ్‌రాజు

'మత్తు'కు దూరంగా ఉండండి

విజయవాడ: నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో మత్తు పదార్థాల దుర్వినియోగంపై జయవాడ జియోన్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు అవగాహనా కార్యక్రమాన్ని స్క్రీన్ ప్రొజెక్టర్ ద్వారా సోమవారం తెలియజేశారు. ఈ సందర్భంగా నవజీవన్ బాల భవన్ జోనల్ కోఆర్డినేటర్ ఎస్ జాకబ్ రాజు మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. మత్తు పదార్థాలతో బతుకు దుర్భరం చేసుకోవద్దన్నారు. విద్యార్థి దశలో మత్తు పదార్థాలకు అలవాటు పడితే ఏకాగ్రతను కోల్పోయి మానసికంగా కుంగిపోవడం జరుగుతుందన్నారు. మత్తు పదార్థాల వల్ల ఆరోగ్యం క్షీణించడంతో పాటు సామాజికంగా, ఆర్థికంగా నష్టపోయి కుటుంబ సత్సంబంధాలను కోల్పోతామని తెలిపారు. అవగాహన లేక మాదక ద్రవ్యాలకు బానిసలవుతున్న వారు ఎక్కువ మంది ఉన్నారన్నారు. మాదక ద్రవ్యాలకు అలవాటు పడిన వారిని డీ-ఎడిక్షన్ చికిత్స ద్వారా సాధారణ స్థితికి తీసుకురావచ్చని తెలిపారు. ఈ చికిత్స అందించేందుకు నవజీవన్ బాల భవన్ సంస్థ నూజివీడులో బోస్కో డీ-ఎడిక్షన్ సెంటర్ ఏర్పాటు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ కోఆర్డినేటర్ ఎస్‌కె నజ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'విజిఆర్'లో రక్త పరీక్షల అత్యాధునిక సేవలు అభినందనీయం

- విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సోమయాజులు
- ల్యాబ్‌లో కొబాస్ సి 311 మిషన్ ప్రారంభం



ప్రజాశక్తి-హెల్త్‌యూనివర్సిటీ

శరీరంలోని ముఖ్యమైన అవయవాల పనితీరును రక్త పరీక్షల ద్వారా తెలుసుకునేందుకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన ఇటాచీ కంపెనీకి చెందిన కొబాస్ సి 311 అనే మిషన్‌ను నగరవాసులకు అందుబాటులోకి తీసుకురావడం శుభపరిణామమని విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డి.వి.ఎస్.ఎస్.సోమయాజులు అన్నారు. మొగల్రాజపురంలోని వీజీఆర్ డయాబెటీస్ హాస్పటల్ ల్యాబ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన కొబాస్ సి 311 మిషన్‌ను సోమవారం ఉదయం విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ డసోమయాజులు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మధుమేహ వ్యాధిగ్రస్తులకు ఎప్పటికప్పుడు అత్యాధునిక సాంకతిక పరిజ్ఞానంతో కూడిన ల్యాబ్ ఎక్యూప్‌మెంట్‌ను ఏర్పాటు చేయడం మధుమేహ వ్యాధిగ్రస్తులకు మంచి అవకాశమని, తద్వారా వారికి ఆరోగ్యపరంగా ఎంతో లబ్ధి చేకూరుతుందన్నారు. ప్రతి నాలుగైదేళ్లకోసారి అడ్వాన్స్‌డ్ ఎక్యూప్‌మెంట్‌ను తీసుకువచ్చి మధుమేహ వ్యాధి ఉన్నవారికి విశేష సేవలందిస్తున్న డాక్టర్ వీజీఆర్‌ను ఈ సందర్భంగా జస్టిస్ సోమయాజులు అభినందించారు. ఈ సందర్భంగా నాణ్యతతో కూడిన మధుమేహ వ్యాధి సేవలు ప్రతి ఒక్కరికీ అందుబాటులోకి రావాలని ఆకాంక్షించారు. కొబాస్ సి 311 మిషన్ పనితీరును ఆయన పరిశీలించారు. వీజీఆర్ డయాబెటీస్ హాస్పటల్ ఛైర్మన్, ప్రముఖ మధుమేహ వ్యాధి వైద్య నిపుణులు డాక్టర్ కె.వేణుగోపాలరెడ్డి మాట్లాడుతూ, గడచిన రెండు దశాబ్ధాలుగా మధుమేహ వ్యాధిగ్రస్తులకు నాణ్యమైన సేవలు అందించాలనే లక్ష్యంతో ఎప్పటికప్పుడు సాంకేతికపరంగా వస్తున్న అడ్వాన్స్‌డ్ ల్యాబ్ ఎక్యూప్‌మెంట్‌ను తీసుకువచ్చి డాక్టర్ వీజీఆర్ డయాబెటీస్ ల్యాబ్‌లో అందుబాటులో ఉంచుతున్నట్లు చెప్పారు. ఇప్పటివరకు సుమారుగా ప్రతి ఐదేళ్లకోసారి అడ్వాన్స్‌డ్ ఎక్యూప్‌మెంట్‌ను ఏర్పాటు చేస్తు మధుమేహ వ్యాధిగ్రస్తులకు నాణ్యతాప్రమాణాలతో కూడిన వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నగరంలోని ప్రముఖ వైద్యులు డాక్టర్ జి.సమరం, డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఛైర్మన్ డాక్టర్ శ్రీధర్‌రెడ్డి, ఇతర ప్రముఖులు హాజరై డాక్టర్ వీజీఆర్‌ను అభినందించారు.

వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోండి : వెలంపల్లి

ప్రజాశక్తి-వన్‌టౌన్: ప్రజలంతా ఆరోగ్య సురక్ష క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం స్థానిక 50వ డివిజన్ కెబిఎన్ కాలేజ్ నందు నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపును వెలంపల్లి శ్రీనివాసరావు ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా చేసేందుకే ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని రూపొందించారన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రతి ఒక్కరికీ వైద్యాన్ని అందిస్తున్నామన్నారు. ప్రజలు అందరు సద్వినియొగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, స్థానిక 50వ డివిజన్ కార్పొరేటర్ బోయి సత్యబాబు, డివిజన్ వైకాపా ఇంఛార్జి బంక విజయ, జిల్లా వైద్య శాఖ అధికారి సుహాసిని, సిఎంహెచ్వో రత్నావళి తదితరులు పాల్గొన్నారు.

